

దేవాలయాల పునర్విభజన!

- ఆదాయం తగ్గడంతో కేటగిరీల మార్పు
- దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల జారీ

ఏలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో పలు దేవాలయాల ఆదాయాలు తగ్గిన కారణంగా వాటి స్థాయిని పునర్విభజన చేశారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవాలయాల ఆదాయాల ఆధారంగా 6 ఏ,బీసీ కేటగిరుల కింద విభజన ఉంది. రూ.50 లక్షల పైబడి ఆదాయం వచ్చే వాటిని 6ఏగా, రూ.17 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు 6 బీ, రూ.15 లక్షలోపు ఆదాయం వచ్చే వాటిని 6సీగా దేవదాయశాఖ చట్టంలో విభజన జరిగింది. ఈ మేరకు దేవాలయాల ఆదాయాల మేరకు వాటికి గ్రేడ్‌లను మార్చారు. ఇటీవలే జిల్లా అధికారులు పంపిన రికార్డులు, ఇతర వివరాల ఆధారంగా గ్రేడ్‌ల పునర్విభజన జరిగిందని జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు తెలిపారు. ఇంకా పలు దేవాలయాల గ్రేడ్‌ల విభజన జరగాల్సి ఉందని తెలిపారు.

జిల్లాలో మార్పులు జరిగిన దేవాలయాలు

- ఏలూరు గాంధీ ఆంధ్ర జాతీయ విద్యాలయం కెనాల్ రోడ్డులోని సత్రాన్ని 6(ఎ)నుంచి 6 (బీ)2కు మార్చారు.
- 6ఏ(2) నుంచి రంగరీజ్ మఠ్ అలియాస్ ఆంజనేయస్వామిగుడి ఏలూరు, ముసునూరు మండలంలో బలివే రామలింగేశ్వరస్వామి ఆలయం, కలిదిండి పటాల భోగేశ్వరస్వామి గుడి, ముదినేపల్లి మండలం కోడూరు లోకేశ్వర, జనార్దనస్వామి గుడులను 6బీకు తగ్గించారు.
- 6 బీ(1) పరిధిలోని 84 దేవాలయాలను 6సీ కేటగిరి కింద విభజన చేశారు. భీమడోలు దేవులపల్లి మృత్యుంజయుడు సత్రం, భీమడోలు మండలం పూళ్ల బ్రుదైశ్వత సంప్రదాయ చిదానంద ఆశ్రమం, ఏలూరు గన్‌బజార్ తల్లాటం పట్టయ్య సుబేధార్ సత్రం, కంది అయ్యన్న సత్రం, నంగులూరి వారి సత్రం (పవర్‌పేట), మందమాణిక్యం సత్రం (తూర్పు వీధి), కేసరపల్లి ఆంజనేయ ధర్మశాల (పాతబస్టాండ్), మద్దులవారీ సత్రం (పవర్‌పేట), నూజివీడులోని కొడిమల కొండయ్య శ్రీరామ విలాస్ సత్రం, నూజివీడు రామకృష్ణ పబ్లిక్ ట్రస్ట్) భ్రమరాంబమల్లేశ్వరస్వామి గుడి, ఆంజనేయస్వామి గుడి (గుండుగొలను), సకలేశ్వరస్వామి గుడి (పూళ్ల), వేంకటేశ్వర అండ్ ఆంజనేయస్వామి గుడి (భీమడోలు), వేంకటేశ్వరస్వామి గుడి (గుండుగొలను), రామ లింగేశ్వరస్వామి గుడి (అంబరు పేట), సీతారామస్వామిగుడి (పూళ్ల), వేగిలింగేశ్వరస్వామిగుడి (చింతలపూడి), కాశీవిశ్వేశ్వర స్వామి గుడి (గురుభట్లగూడెం), భోగేశ్వరస్వామిగుడి (పోతునూరు), యోగలింగేశ్వరస్వామి గుడి (జోగన్నపాలెం), సీతారామస్వామిగుడి (సానిగూడెం), రామ మందిరం (తూర్పులాకులు, ఏలూరు), లక్ష్మీగణపతి స్వామి గుడి (సత్రంపాడు), నూకాలమ్మ గుడి (ఏలూరు, కొత్తపేట), కనకదుర్గమ్మ గుడి (పత్తేబాద), కాశీ విశ్వేశ్వరస్వామి గుడి (పవర్‌పేట), సీతారామస్వామి గుడి (దక్షిణపువీధి), కనకదుర్గమ్మగుడి (12 పంపుల సెంటర్), వాసు దేవాలయం (పవర్ పేట), అన్నపూర్ణ సమేత ప్రతాపవిశ్వేశ్వర ఆలయం (అగ్రహారం), జ్వాలాపహరేశ్వర స్వామి గుడి (దక్షిణపు వీధి), వేంకటేశ్వరస్వామిగుడి (పడమర వీధి), చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి గుడి (పత్తేబాద) మార్కెండేయ ఓంకార విశ్వేశ్వరస్వామి గుడి (దక్షి ణపు వీధి), జగదాంబ గుడి (జీలుగుమిల్లి), గాగేశ్వర స్వామి గుడి (తడికలపూడి), సీతారామస్వామిగుడి (కామ వరపుకోట), మందాన గోపాలస్వామిగుడి (కొయ్యలగూడెం), కనకలింగేశ్వరస్వామి గుడి (ఆటపాక), కనకలింగేశ్వరస్వామి (కైకలూరు), వల్లభేశ్వరస్వామిగుడి (వెంకటాపురం, కలిదిండి), రామలింగేశ్వరస్వామి (కైకలూరు) సోమేశ్వరస్వామిగుడి(కోరుకల్లు), రామేశ్వర స్వామిగుడి (కైకలూరు), నాగేశ్వరస్వామిగుడి (ఆశన్నగూడెం)ధర్మలింగేశ్వర స్వామిగుడి (ధర్మాజీగూడెం), మల్లేశ్వరస్వామిగుడి (అండవల్లి), అమృతలింగేశ్వరస్వామి (సింగరాయ పాలెం), వేణుగోపాలస్వామిగుడి (ముదినేపల్లి), మల్లేశ్వరస్వామిగుడి (పెదగొన్నూరు). సర్వేశ్వరస్వామిగుడి (కాకరమిల్లి), కరుణానిధిలక్ష్మీ నర్సిహస్వామిగుడి (నాగన్నమిల్లి), కేశవస్వామిగుడి (చానుమిల్లి)మల్లేశ్వరస్వామిగుడి(అడవికొలను), కోటమహిషాసుర మర్ధినిగుడి (నూజివీడు), వెంకటాచలస్వామిగుడి (నూజివీడు), దుర్గామల్లేశ్వరస్వామిగుడి (నూజివీడు), రాజగోపాలస్వామి గుడి (కలపర్రు), రామాలయం(పెదవేగి), అభయనేయ స్వామిగుడి (వంగూరు), వేంకటేశ్వర, వేణుగోపాల్‌స్వామిగుడి (విజయరాయి), పార్వతీ పరమేశ్వరస్వామిగుడి (పెదవేగి), మందాన గోపాలస్వామి గుడి(ముండూరు), త్రిపురేశ్వర స్వామిగుడి (ముండూరు), భావన్నా రాయణగుడి (పట్టిసం, పోలవరం), సీతారామస్వామి గుడి (పోలవరం), కొండాంధ్రమ్మస్వామి గుడి (బొర్రంపాలెం), కాశీ విశ్వేశ్వరస్వామిగుడి (టి.నర్సాపురం), బాలగోపాలస్వామిగుడి (కాగుపాడు), చల్లాలమ్మగుడి(కంసాల గుంట) చేరాయి.





ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

బలివే ఉత్సవాలకు పటిష్ఠ భద్రత : ఎస్పీ

ముసునూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగ కుండా పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ ఆదేశించారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారిగేట్లు, తమ్మిలేరులో స్నానాల ఘాట్లు, పార్కింగ్ పాయింట్లు తదితర వాటిని పరిశీలించారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారని, వారిపట్ల ప్రేమ అప్యాయతలను చూపుతూ పోలీస్ సిబ్బంది తమ విధులను నిర్వర్తించాలన్నారు. వీఐపీలతో పాటు దర్శనానికి ఐదుగురిని మాత్రమే పంపాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని డీఎస్పీ ప్రసాద్, సీఐ రామకృష్ణలకు సూచించారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో అనుమానితులుగా ఉన్నవారిని వెంటనే అదుపులోకి తీసుకునేలా ప్రత్యేక బృందాన్ని పెట్టాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌తో కలిసి వివిధ శాఖల ఆధ్వర్యంలో ఉత్సవాలకు చేసే ఏర్పాట్లపై సమీక్షించారు. డీఎల్‌పీవో సుందరి, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంపీడీవో జి.రాణి, ఈవో పామర్తి సీతారామయ్య, ఎస్‌ఐ ఎం.చిరంజీవి. పెదవేగి పోలీస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గట్టు.. జారుతోంది!

- ప్రమాదకరంగా పట్టిసీమ ఫెర్రీ రేవు వద్ద గోదావరి గట్టు.. పట్టించుకోని అధికారులు

పోలవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఫెర్రీ రేవు సమీపంలోని సచివాలయం గ్రామ రెవెన్యూ భవనం పోలీస్ గెస్ట్‌హౌస్ భవనాలు ఉన్న ప్రాంతంలో గోదావరి గట్టు భారీ స్థాయిలో కోతకు గురై ప్రమాదభరితంగా మారింది. ఫెర్రీ రేవుకి కుడివైపున ఉన్న కొవ్వాడ కాల్వ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి వెళ్లే జలాల తాకిడికి గట్టు కోతకు గురై సచివాలయ భవనం కాల్వలోకి పడిపోయే స్థితికి చేరుకుంది. రెండేళ్లగా ఇదే పరిస్థితి ఉంది. గత మూడేళ్లగా అదే ప్రాంతంలో పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలపై అధికారులు, జేసీ సమీక్షలు నిర్వహిస్తూ గట్టు పునరుద్ధరణ పనులు చేయాలని సూచించారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గత రెండేళ్లగా వచ్చిన వరదలకు గట్టు మరింత కోతకు గురై ప్రమాదభరితంగా మారింది.

ఇటీవల మహాశివరాత్రి ఉత్సవాలపై జరిగిన తొలి సమీక్ష సమయంలో ఆ ప్రాంతం కనిపించకుండా స్థానిక అధికారులు గ్రీన్‌షెడ్ తెరలు కట్టారు. మూడేళ్లగా పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలకు గోదావరి దాటేందుకు ఫెర్రీ రేవును స్థానిక కన్నాపురం అడ్డరోడ్డుకి సమీపంలో ఏర్పాటు చేస్తుండడం వల్ల ఈ రేవును వినియోగించే అవసరం ఏముందిలే అనే నిర్లక్ష్యభావనతో కోతకు గురైన రేవుని అధికారులు వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి కొవ్వాడ కాల్వ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి కొవ్వాడ కాల్వ వరద జలాలు గోదావరిలో కలిసే ప్రాంతంలో స్పిల్ ఛానల్‌కి ఇరువైపులా గట్లకు లైనింగ్ కాంక్రీటు బండ్ నిర్మించాల్సి ఉండగా ఎలాంటి నిర్మాణాలు చేయలేదు. ఏటా కాల్వ వరద జలాల ధాటికి ఇరువైపులా గట్లు తీవ్ర స్థాయిలో కోతకు గురవుతున్నాయి. దీనికి తోడు స్పిల్ ఛానల్ కాంక్రీటు బండలు సైతం గోదావరిలోకి కొట్టుకుపోయి మట్టి మేటలు వేయడం వల్ల, స్పిల్ ఛానల్‌లో ఉన్న 26 గేట్లలో కుడివైపున ఉన్న గేట్ల ద్వారా మాత్రమే నీటి విడుదల చేయడం వల్ల గట్టు కోతకు గురవుతోంది. దీనికి తోడు స్పిల్ ఛానల్‌లో సిల్టు తీయకపోవడంతో మట్టి మేట వేసి వరద జలాలు కుడివైపు నుంచి ప్రవహిస్తుండడంతో గట్టు కోతకు గురై అండలుగా కిందకు పడిపోతోంది. ఈ విషయంపై కొవ్వాడ రిజర్వాయర్ ఏఈ రాహుల్ భాస్కర్‌ను వివరణ కోరగా.. 'శాశ్వత ప్రాతిపదికన అవుట్ ఫాల్ స్లూయిజ్ స్పిల్ ఛానల్‌కి ఇరువైపులా లైనింగ్ కాంక్రీట్ బండ్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి రెండు కోట్ల రూపాయల బడ్జెట్‌తో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. తాత్కాలిక రక్షణ చర్యల కోసం గత నెల 29న రూ.2.90 లక్షలకు టెండర్లు ఖరారు చేశాం.. పనులు త్వరలోనే ప్రారంభిస్తా'మని తెలిపారు.

పావుగంట ముందే గేట్లు క్లోజ్

- నేడు గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు
- ఉదయం పది నుంచి 12.30 గంటల వరకు
- మధ్యాహ్నం మూడు నుంచి ఐదున్నర వరకు
- ఏలూరు పరిసరాల్లో ఆరు పరీక్ష కేంద్రాలు.. 4,415 మంది అభ్యర్థులు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఏలూరు, పరిసర ప్రాంతాల్లోని ఆరు కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరుగుతాయి. 4,415 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష ప్రారంభ సమయానికి పావు గంట ముందుగానే ప్రధాన గేట్లను మూసివేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. గంటన్నర ముందుగానే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. శాంతి భద్రతల్లో భాగంగా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద బీసీఆర్‌పీసీ సెక్షన్ 163ని అమల్లోకి తెచ్చారు. పరీక్ష నిర్వహణపై సామాజిక మాధ్యమాల్లో పలు ప్రచారాలు వైరల్ కాగా, ముందుగా నిర్దేశించిన షెడ్యూలు ప్రకారమే ఆదివారం గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు యధాతథంగా జరుగుతాయని ఏపీపీఎస్సీ ఉన్నతాధికారులు శనివారం రాత్రి ప్రకటించడంతో సందిగ్ధతకు తెరపడింది. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సుల రాకపోకల సమయాలను రీషెడ్యూల్ చేయగా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. పరీక్షలు శాంతియుతంగా ముగిసేందుకు ప్రతీ కేంద్రానికి వివిధ శాఖల జిల్లా అధికారులను లైజన్ ఆఫీసర్లుగా నియమించారు. పరీక్షార్థుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో 99122 44293, 80085 39786 నంబర్లతో హెల్ప్‌లైన్ కేంద్రం ఇప్పటికే పనిచేస్తోంది.

ఏలూరులో పరీక్ష కేంద్రాలు

- వట్లూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల
- సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల
- సీఆర్ఆర్ మహిళా కళాశాల
- కొత్త బస్టాండ్ వద్ద సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల
- సెయింట్ థెరిస్సా బాలికల జూనియర్ కళాశాల
- దుగ్గిరాల పరిధిలోని ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల



సీసీ కెమెరా నిఘాలో సీఆర్‌రెడ్డి డిగ్రీ కాలేజీ

సీసీ కెమెరా చూస్తోంది!

- అన్ని పోలీసు స్టేషన్లలో ఏర్పాటు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో కదలిక
- పారదర్శకత కోసమే ఈ చర్యలు



7



ఇంటర్ పరీక్షలపై మాట్లాడుతున్న డీవీఈవో కె.ప్రభాకరరావు

ఇంటర్ పరీక్షలపై నిఘా

- 720 సీసీ కెమెరాల ఏర్పాటు
- సీఎస్‌లు, డీవోలతో సమావేశంలో డీవీఈవో ప్రభాకరరావు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : 'సీసీ కెమెరాల సునిశిత నిఘాలో నిర్వహించే ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు జరిగే గదుల్లో అనుమానాస్పద కదలికలు, కార్యకలాపాలను వెంటనే పట్టేస్తాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటా'మని ఇంటర్ పరీక్షల ప్రత్యేకాధికారి, డీవీఈవో ప్రభాకరరావు హెచ్చరించారు. మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ థియరీ పరీక్షల నిర్వహణపై జిల్లాలోని 55 కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో శనివారం సీఆర్ఆర్ కళాశాల మినీ కాన్ఫరెన్సు హాలులో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మాస్ కాపీయింగ్ లేదా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్టుగా తనిఖీ బృందాల పరిశీలనలో రుజువైతే పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారిపై చర్యలు తప్పవు. పరీక్ష ప్రారంభ సమయం 9గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించవద్దు. ఈ ఏడాది నుంచి జిల్లాలో కొత్తగా ప్రారంభిస్తున్న చాట్రాయి, ధర్మాజీగూడెం, పెదపాడు, పెదవేగి పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులను సిద్ధంగా ఉంచేలా ముందుగానే సీఎస్‌లు, డీవోలు వెళ్లి నిర్ధారించుకోవాలి. సమస్యాత్మక కేంద్రాలైన వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి, కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, భీమడోలు వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రత్యేక నిఘా పరీక్షలు ముగిసేవరకు కొనసాగుతుంద'న్నారు.

ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ మాట్లాడుతూ.. 'జిల్లాలో పరీక్షలు జరిగే 55 కేంద్రాల్లో మొత్తం 640 పరీక్ష గదులను 720 సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తాం. 800 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. విద్యార్థులు హాల్ టిక్కెట్లను తమ ఫోన్ నుంచే వాట్సాప్ నెంబరు 95523 00009కి హాయ్ సందేశాన్ని పంపి లేదా కళాశాల లాగిన్ నుంచి కూడా పొందవచ్చు. పరీక్షలకు సంబంధించిన ఫిర్యాదులు, సమాచారం కోసం ఆర్ఐవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను 08812-230197 లేదా బీఐఈ కార్యాలయంలో టోల్‌ఫ్రీ నెంబరు 1800 425 1531తో ఏర్పాటు చేశా'మన్నారు. జిల్లా పరీక్షల కమిటీ(డెక్) సభ్యులు ఎల్.శ్యాం కుమార్, కె.శ్రీనివాసరావు, బి.వి.శ్రీనివాస్, బి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

డీపీఎంవోగా డాక్టర్ బాలప్రకాశ్ నియామకం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యఆరోగ్యశాఖ డీపీఎంవో (డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్స్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్)గా డాక్టర్ బాలప్రకాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫారిన్ సర్వీసులో పరిమితకాలానికి డిప్యూటేషన్‌పై ఆయనను నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు. గైనకాలజీ వైద్యంలో 25 ఏళ్ల సుదీర్ఘ అనుభవం వున్న ఆయననే అదనపు బాధ్యతలపై డీఎంహెచ్‌వో కార్యాలయ పరిపాలనాధికారి(ఏవో)గా నియమించే అవకాశం ఉంది. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కొంతకాలం పనిచేసిన తర్వాత ద్వారకా తిరుమల పీహెచ్‌సీ వైద్యాధికారిగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. మార్చి ఒకటి డీపీఎంవో బాధ్యతలను చేపట్టనున్నారు.



సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి

సారా తయారీ నిర్మూలనకు నవోదయం 2.0 కార్యక్రమంతో పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్‌శాఖలతో పాటు సర్పంచి, ఎంపీపీలతో కలిసి త్వరలో గ్రామసభలను పెట్టాలని నిర్ణయించాం. వరుస దాడులతో చాలా వరకు సారా కాయడం తగ్గింది. వారిలో మరింత అవగాన తీసుకొచ్చేందుకు సారా వల్ల కలిగే దుష్పరిణామాలు వివరించి చైతన్యం తీసుకొస్తాం. డ్వామా ద్వారా ఉపాధి పనులు, డీఆర్‌డీఏ, పశుసంవర్ధకశాఖల ద్వారా ఉపాధి యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకుంటాం.

- అవులయ్య, ఏలూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్



సారాపై.. కన్నెర్ర!

- ఎన్నికల కోడ్ ముగిశాక కార్యాచరణ
- తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధికి చర్యలు

నవోదయం 2.0కు శ్రీకారం.. 16 మండలాల్లో గ్రామసభలు

ఏలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొచ్చిన కూటమి సర్కారు సారా రక్కసిపై ఉక్కుపాదం మోపేందుకు రంగం సిద్ధం చేసింది. సారా రహిత గ్రామాలే లక్ష్యంగా నవోదయం 2.0 అమలుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఈ కార్యక్రమం ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ మండలి ఎన్నికల కోడ్ కారణంగా కొంత జాప్యం జరిగింది. కోడ్ ముగిసిన వెంటనే ఎక్సైజ్‌శాఖ ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుంది. జిల్లాలో ఏడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లు ఉండగా, ఇందులో ఐదు స్టేషన్లు పరిధిలోని భీమడోలు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు, చింతలపూడిల్లోని 16 మండలాల్లో 140 గ్రామాల్లో సారా ఆనవాళ్లను గుర్తించారు. వివిధ దాడుల్లో ఈ ప్రాంతాల్లో 70 శాతం వరకు సారా రక్కసిని అడ్డుకున్నారు. ఇంకా మిగిలిన 30 శాతం సారా నిర్మూలన దిశగా 16 చోట్ల గ్రామ సభలతో ముందడుగు వేయాలని నిర్ణయించారు. ఇటీవలే ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ జిల్లా స్థాయిలో సమావేశం నిర్వహించి సారా ఆనవాళ్లు లేకుండా అడ్డుకోవాలని, తయారీదారులకు ఉపాధి మార్గాలు అన్వేషించాలని సూచించారు.

- అక్టోబరు నుంచి ఇప్పటి వరకు సారా బట్టీలపై దాడులు నిర్వహించి 360 కేసులు నమోదు చేసి 239 మందిని అరెస్టు చేశారు. 2,438 లీటర్ల సారా, 160 కేజీల నల్లబెల్లంను సీజ్ చేసి, 1,48,480 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీదారులకు నల్లబెల్లం విక్రయిస్తున్న పోలవరంలో ఇద్దరిని, చింతలపూడిలో నలుగురిని, నూజివీడులో ఒకరిని అరెస్టు చేశారు. ద్విచక్ర వాహనాలపై సారా విక్రయిస్తూ 28 మంది చిక్కారు. మొత్తంగా 453 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. రెండోసారి పట్టుబడిన నలుగురిని అరెస్టు చేసి వారికి రూ.1.20 లక్షలు జరిమానా విధించారు.

మూడు కేటగిరీలుగా విభజన

140 గ్రామాల్లో సారా తయారీ చేసే వారిని మూడు కేటగిరిలుగా విభజించారు. సారా తయారు చేసి ఇతర గ్రామాలకు సరఫరా చేస్తున్న 29 గ్రామాలను అధికారులు గుర్తించి 'ఏ' కేటగిరిలో నమోదు చేశారు. ద్వారకా తిరుమల మండలంలో ఐఎస్ జగన్నాథపురం, నూజివీడులో సిద్ధార్థనగర్ తండా, సుంకొల్లు, ఆగిరిపల్లిలో ఎస్‌ఏపేట, చాట్రాయిలో చీపురుగూడెం, పోలవరం మండలంలో ఎల్ఎన్‌డీపేట, కొమ్ముగూడెం, నేతప్పకోట, ముద్దప్పగూడెం, కొవ్వాడ, టి.సత్తుపల్లి, గొల్లాయగూడెం, గుజ్జులవారిగూడెం, మారేడుబాక, శ్రీధరవేలేరు, వసంతవాడ, బడ్డబోరు, చింతల పూడి మండలంలో నాగిరెడ్డిగూడెం, తల్లార్లపల్లి, కంచనగూడెం, నామవరం, బంజరు గూడెం, వేలేరుపాడులో యడ్లబోరు, జీలుగుమిల్లి మండలంలో ములగలంపల్లి, కామయ్యపాలెం తదితర గ్రామాలను సారా తయారీ గ్రామాలుగా గుర్తించారు. 'బీ' కేటగిరిలో సారా కొని ఇతర గ్రామాల్లో 37 గ్రామాల వారు అమ్ముతున్నారని గుర్తించారు. 'సీ' కేటగిరి కింద 74 గ్రామాల్లో కేవలం అమ్మకాలు జరుగుతున్నట్లు గుర్తించారు. హర్యానా నుంచి సారా తయారీకి బెల్లం పొడి సరఫరా అవుతున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు.



పండుగ ఆశలు..

శివరాత్రికి కొబ్బరికి డిమాండ్

రైతుల నుంచి భారీగా కొనుగోళ్లు

పెరిగిన కొబ్బరికాయ ధర

నష్టాల నుంచి బయట పడతామని ఎదురు చూస్తున్న రైతులు

పెదవేగి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : శివరాత్రి వస్తున్నది. భక్తులు గుళ్ళు, గోపురాలకు వెళ్తారు. గుడికెళ్లే ప్రతిఒక్కరూ కొబ్బరికాయ కొట్టి కోర్కెలు తీర్చాలని భగవంతుని ప్రార్థిస్తారు. నాలుగేళ్లుగా కొబ్బరికి గిట్టుబాటు ధర లేక అల్లాడిన రైతులకు రెండునెలలుగా పెరుగుతూ వచ్చిన ధరతో ఊరట చెందుతున్నారు. కొబ్బరికాయ ధర పండుగ సమయంలో ఎక్కువగా ఉంటుందని రైతులు, వ్యాపారులు చెప్తున్నారు. ప్రధానంగా మహాశివరాత్రికి డిమాండ్ ఎక్కువగా ఉంటుందనే నమ్మకంతో వ్యాపారులు రైతుల నుంచి భారీగా కొబ్బరికాయలు కొనుగోలు చేస్తున్నారు. వారం రోజులుగా కాయలు ఒలిచే కూలీలు తీరిక లేకుండా పనిచేస్తున్నారు. శివరాత్రి సమీపిస్తుండడంతో ఎగుమతులు ఊపందుకున్నాయి. ధర కూడా ఆశించిన స్థాయిలో నిలకడగా పెరుగుతూ వస్తుండడంతో రైతులు లాభాలపై నమ్మకంతో ఉన్నారు. మెట్టప్రాంతంలో ఉద్యాన పంటల్లో కొబ్బరి ప్రధానపంటగా రైతులు సాగు చేస్తున్నారు. నాలుగేళ్లుగా ఒడిదుడుకులతో సాగిన కొబ్బరి ధర ఈ ఏడాది తొలినుంచి పెరుగుతూ వచ్చింది. ఏడాది కిందట రూ.5 లకు కూడా కొనే వ్యాపారి లేక రైతులు విలవిల్లాడారు. కాగా రెండు నెలలుగా ధరలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది. రైతు వద్ద కాయ రూ.8 నుంచి 10 వరకు కొంటున్నారు.

• చెట్లకు ధర పెరిగింది



గతేడాది కొబ్బరికి గిట్టుబాటుధర లేక చెట్టును రూ.600లకు ఇవ్వాల్సి వచ్చింది. అదే మంటే కొబ్బరి కాయలకు ధర లేదు. ఆ ధరకు ఇస్తే తీసుకుంటాం. అంటూ వ్యాపా రులు తేల్చిచెప్పడంతో తప్పనిసరి పరిస్థితిలో వాళ్ళడిగిన ధరకే ఇవ్వాల్సి వచ్చింది. ఈ ఏడాది డిమాండ్ పెరగడంతో చెట్ల ధరకు రెక్కలు వచ్చాయి. దీంతో ఒక్కో కొబ్బరి చెట్టు కాపును బట్టి రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకు ధర వచ్చింది. ధర ఇలా ఉంటే రైతులకు గిట్టుబాటుగా ఉంటుంది.

- షేక్ హుస్సేన్, రైతు, లక్ష్మీపురం

• రూ.15 ఉంటేనే గిట్టుబాటు



పెరిగిన పెట్టుబడి నేపథ్యంలో ఒక్కో కొబ్బరికాయకు కనీసం రూ.15 వస్తే లాభాలు వచ్చినట్లే. శివరాత్రికి కొబ్బరి కాయలకు డిమాండ్ పెరుగుతుంది. ఈ ఏడాది సీజను ఆశాజనకంగా ప్రారంభమైంది. ఐదేళ్ల గరిష్టానికి కొబ్బరి ధర వస్తుందనే ఆశతో ఉన్నాం. మూడేళ్ళుగా ధర లభించక అవస్థలు పడ్డాం. గతంలో పది రూపాయలు మించి ధర పలకలేదు. నష్టాల నుంచి ఈ ఏడాది బయట పడతామనే ఆశ ఉంది.

- మేకా గంగాధరరావు, కొబ్బరి వ్యాపారి, లక్ష్మీపురం, పెదవేగి మండలం

• ధరల స్థిరీకరణ వర్తింపజేయాలి



కొబ్బరి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి పథకాన్ని వర్తింపచేయాలి. నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొబ్బరికొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలి. కొబ్బరి ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉప ఉత్పత్తుల తయారీకి చర్యలు తీసుకుంటే కొబ్బరికి మంచిరోజులు వచ్చినట్లే. యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి.

- కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్

దాళ్వా రైతులకు చిట్టెలుకలు సవాల్ విసురుతున్నాయి. వీటి నుంచి పంటలను రక్షించుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. కోట్ల రూపాయల విలువైన పంట ధ్వంసం కావడంతో ఎలుకా ఎంత పనిచేశావ్..! అంటూ గగ్గోలు పెడుతున్నారు. పంట నాశనం అయిన తర్వాత ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం మందు సరఫరా చేయడంపై వారు పెదవి విరుస్తున్నారు.



ఎలుకా.. ఎంత పనిచేశావ్..!

దాళ్వా సాగుపై మూషిక దాడి

ఎకరానికి రెండు బస్తాల వరి దుబ్బులు ధ్వంసం

పశ్చిమలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నాశనం

రైతుల ఆదాయానికి కోట్లలో నష్టం

నష్టం జరిగాక మందు పంపిణీపై రైతుల పెదవి విరుపు

భీమవరం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాట్లు దశ నుంచే పంట పండే వరకు వరి దుబ్బులను వారు ఎంతో అపురూపంగా చూసుకుంటారు. ప్రతి దుబ్బు బాగుంటేనే అనుకున్న దిగుబడి వచ్చేది. అలాంటి దుబ్బులను ఎలుకలు కొరికి ముక్కలు చేస్తున్నాయి. ఫలితంగా కోట్ల రూపాయల పంటను నష్టపోతున్నారు. వీటి నివారణకు రైతులు ఏటా విఫలమవుతూనే ఉన్నారు. ఈ ఏడాది దాళ్వాలోను ఎలుకలు తమ ప్రతాపాన్ని చూపాయి. పశ్చిమ గోదావరిలో రెండు లక్షల 25 వేల ఎకరాల్లో దాళ్వా సాగు సాగింది. వీటిలో లక్ష ఎకరాల వరకు పొట్ట ఈనిక దశలో ఉంది. మిగిలిన లక్షా 25 వేల ఎకరాల సాగు చిరు పొట్ట దశలో ఉంది. ముందస్తు సాగుపై ఇప్పటికే ఎలుకల ప్రభావం బాగా పడింది. వెనుకస్తు సాగులోను అలాగే ఉందని రైతులు అంటున్నారు. దీంతో ఈ ఏడాది దాళ్వాలో ఎలుకల నష్టం వల్ల 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు దిగుబడి తగ్గనుంది. దీనివల్ల రైతన్నలకు రూ.350 కోట్ల వరకు ఆదాయానికి గండి పడుతుంది.



భీమవరం మండలం గునుపూడిలో ఎలుకలు పాడిచేసిన చేను

రైతుల ప్రయత్నాలు ఫలించలేదు

దాళ్వా సాగులో ఎలుకల నివారణకు రైతులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నాట్లు వేసిన పది రోజుల తర్వాత నుంచి ఎలుకల నివారణా చర్యలు చేపట్టారు. గుళికలు ఉడక వేసిన వడ్లు పెట్టడం, ఎలుకలు పట్టే బుట్టలు వేయించడం, కుండ పొగతో చంపడం వంటివి చేశారు. అయినా ఎలుకలు నష్టం చేసేశాయి. ఎకరానికి రెండు బస్తాలకు పైబడి పండే వరిని పాడు చేశాయి.

ఎలుకకు రూ.125

ఎలుకలు పట్టే వారి సంఖ్య ఈ ఏడాది తగ్గిపోయింది. వారిలో ఎక్కువ మంది చేపలు పట్టుకోవడానికి వెళ్లిపోతున్నారు. అక్కడే వారికి ఎక్కువ ఆదాయం వస్తోంది. దీంతో ఎలుకలు పట్టే విధానంలో తక్కువ మంది ఉన్నారు. ఈ దాళ్వా పంటలో ఎలుక ఒక్కింటికి రూ.125 చేసేశారు. దీంతో రైతుకు వేల రూపాయలు ఎలుకలు పట్టడానికి అవుతోంది. ఈ మధ్యన ఎలుకకు రూ.125గా చేశారు. దీంతో రైతులలో ఎలుకలు పట్టించడం భయంగా మారింది. అయినా తప్పడం లేదు. అలా పట్టించినా నష్టం చేసేశాయి.

అంతా అయ్యాక మందు పంపిణీ

వ్యవసాయ శాఖ నష్టం జరిగాక మందు పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది అలాగే చేశారు. ఈ నెల 20న ఎలుకల మందు జిల్లా వ్యాప్తంగా రైతులకు వ్యవసాయ శాఖ అందించింది. అయితే వరిచేలు చాలా ప్రాంతాల్లో ఈనిక దశకు వచ్చేశాయి. వరి చేలను ఎలుకలు ఎంత పాడు చేయాలో అంతా చేసేశాయి. దీంతో వ్యవసాయ శాఖ ఇచ్చిన ఎలుకల నివారణ మందు ఇప్పుడు ఉపయోగం లేదని రైతులు అంటున్నారు.

• ఎకరానికి మూడు బస్తాల తగ్గుదల



ఈ పంటలో ఎలుకలు బాగా నష్టం చేశాయి. ఎకరానికి మూడు బస్తాలు పంట తగ్గిపోయింది. ఎలుకలు పట్టేవారి సంఖ్య తగ్గిపోయింది. కావలసినప్పుడు వారు అందుబాటులో ఉండటం లేదు. నేను పది రోజుల నుంచి వారి కోసం ఎదురుచూశాను.

- ఎన్.కృష్ణ (గునుపూడి)

• మూడుసార్లు పట్టించాను



ఎలుకలు దాళ్వా చేనును పాడుచేశాయి. ఎలుకకు రూ. 100 ఇచ్చి మూడుసార్లు పట్టించాను. అయినా వరి చేను పాడు చేశాయి. ఇప్పుడు రూ.125 ఇస్తే ఎలుకలను పడతామంటున్నారు. తప్పనిసరి పరిస్థితులలో పట్టించాల్సి వస్తుంది. ఎలుకల వల్ల ఎకరానికి రెండు బస్తాలు నష్టం ఉంటుంది.

- పి.బాబ్జి, యనమదుర్రు

కవలల కనువిందు...

పెనుగొండ /తణుకు ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అబ్బాయో.. అమ్మాయో పుడితే ఆ కుటుంబం అంతా పంగడ చేసుకుంటుంది.. అదే ఒకేసారి ఇద్దరు పుడితే ఇంకెంత ఆనందం.. కవలలు పుట్టడం చాలా అరుదు.. అలా పుట్టిన వారు అదృష్టవంతులే.. శనివారం కవలల దినోత్సవం వివిధ పాఠశాలల్లో సందడిగా నిర్వహించారు.. తణుకు మాంటిస్సోరి స్కూలులో జరిగిన కార్యక్రమంలో డైరెక్టరు అనపర్తి ప్రకాశరావు మాట్లాడుతూ తమ స్కూలులో 29 మంది కవలలు ఉన్నారన్నారు. వారికి బహుమతులు, స్వీట్లు పంపిణీ చేశారు. పెనుగొండ భాష్యం పాఠశాలలో ఎనిమిది మంది కవలలకు ప్రిన్సిపాల్ అప్పారావు చిరు కానుకలను అందించారు. ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు.



పెనుగొండ భాష్యం స్కూల్‌లో కవలలు




↑ తణుకు మాంటిస్సోరి స్కూల్‌లో కవల విద్యార్థులతో డైరెక్టర్



నారసింహక్షేత్రంలో గణపతి హోమం

నేడు అంకురార్పణ.. ధ్వజారోహణ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై శ్రీలక్ష్మీనారసింహుని ఆలయంలో శనివారం సైతం వేదమంత్రోచ్చరణల నడుమ మహాగణపతి లక్షమోదక హోమాన్ని పండితులు, రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన నిర్వహించనున్న అతిరుద్రప్రయోగ సహిత సుదర్శన నృశింహమహాయజ్ఞం ప్రారంభానికి ముందు ఈహోమాన్ని జరుపుతారు. ఈక్రమంలో శనివారం ఉదయం ఆలయ యాగశాలలో మహాగణపతి లక్షమోదక హోమాన్ని వేదపండితులు, రుత్వికులు వేదమంత్రోచ్చరణల నడుమ నేత్రపర్వంగా జరిపారు. నరసింహ ఉపాసకులు కొచ్చర్లకోట నరసింహ గురుజీ ఆధ్వర్యంలో సీవీ కుటుంబరావు పర్యవేక్షణలో ఈ యాగాన్ని జరిపారు. ముందుగా ఆలయ యాగశాలలో ఉన్న హోమగుండం వద్ద పండితులు మంత్రోచ్చణలు చేస్తూ వివిధ దినుసులను వినియోగిస్తూ క్రతువును నిర్వహించారు. ఈక్రమంలో మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో జరిగే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణ, కలశస్థాపన కార్యక్రమాన్ని జరుపుతామని భక్తులు తరలిరావాలని నరసింహగురుజీ కోరారు.



శ్రీవారికి భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. దాదాపు ఇరవై వేల మందికి పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపు కున్నారు. పలువురు భక్తులు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారి ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటలపైబడి సమయం పట్టింది.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

26న రాత్రి లింగోద్భవకాల అభిషేకం, కల్యాణం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుని ఆలయంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి.. వచ్చేనెల 1 వరకు జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు శివయ్యను పెండ్లి కుమారుడుగాను, గంగా, పార్వతి అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేయనున్నారు. ఆలయంలో చలువ పందిళ్లను నిర్మించారు. తాటియాకులు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో సుందరీకరించారు. విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.. 25 రాత్రి స్వామివారి గ్రామోత్సవం, 26న మహాశివరాత్రి పర్వదినాన విశేషకార్యక్రమాలు జరుగుతాయన్నారు. రాత్రి 10 గంటలకు లింగోద్భవకాల అభిషేకం, తర్వాత స్వామి, అమ్మవారి కల్యాణం, అనంతరం గ్రామోత్సవం జరుగుతాయని తెలిపారు.



ద్వారకాతిరుమల శేషాచలంపై ఉన్న శివదేవుని ఆలయం (ఇన్‌సెట్‌లో)అలంకరణలో స్వామి వారు





విద్యుత్ కాంతుల్లో పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం.. పట్టిసీమ వద్ద నదిపై పంట్లతో ఏర్పాటు చేస్తున్న నడక మార్గం

పాలకొల్లు అర్బన్/పోలవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లు, షామియానాలను ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారి దర్శనానికి ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు. పలు సేవాసంస్థల సభ్యులు, వీహెచ్‌పీ, సత్యసాయి సమితి, శ్రీక్షీరా రామలింగేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు వలంటీర్లుగా సేవలు అందించనున్నారు. ఆలయ ఈవో ముత్యాల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ వాసు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. బుధవారం తెల్లవారు జామున 4గంటల నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రి 8.35 గంటలకు జగజ్యోతి వెలించనున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో దగ్గులూరుకు చెందిన వరదా సోమేశ్వరరావు, మాణిక్యం దంపతులు నేసిన మల్లన్న పాగాను స్వామివారి ఆలయ శిఖరం నుంచి గాలిగోపురం వరకు మల్లన్న పాగాను అలంకరించనున్నారు. అనంతరం పట్టణానికి చెందిన మామిడి నాగ వెంకట సత్యనారాయణ మూర్తి కుటుంబ సభ్యులతో స్వామివారికి లక్ష పత్రి పూజ నిర్వహించనున్నారు.

వీరభద్రస్వామి వారి సంబరాలు: పట్టణంలో కొత్తపేటలో వీరభద్రస్వామి ఆలయంలోనూ, మఠం వీధిలోని వీరభద్రస్వామి ఆలయంలోనూ బుధవారం మహా శివరాత్రి ఉత్సవాలను నిర్వహించి, రాత్రి భక్తులచే నిప్పుల గుండం తొక్కడం కార్యక్రమాన్ని జరిపేందుకు ఆలయాల కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

• పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను తహసీల్దారు సాయిరాజు శనివారం పరిశీలించారు. నదిపై నడకదారి కోసం పంట్ల ఏర్పాటు, టికెట్ కౌంటర్లు, చలువ పందిళ్లు, ఇసుక తిన్నెల్లో నడక మార్గం కోసం చేస్తున్న ఏర్పాట్లు తహసీల్దారు పరిశీలన చేశారు. నదికి ఇటువైపు నుంచి ఇసుక తిన్నెల్లోకి రాకపోకలు సాగించేందుకు నడకమార్గం కోసం నదిపై ఏర్పాటు చేస్తున్న పంట్ల వెల్డింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పోలవరం డీఎస్పీ ఎం వెంకటేశ్వరరావు, సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి వీరంపాలెంలో ఉత్సవాలు



శివరాత్రి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వెంకట రమణ సిద్ధాంతి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం శ్రీ బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో ఈనెల 25 నుంచి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకట రమణ సిద్ధాంతి తెలిపారు. స్థానిక వీరంపాలెం క్షేత్రంలో శనివారం ఆయన శివరాత్రి ఉత్సవాల కార్యక్రమాలను విలేకర్లకు తెలిపారు. ఈనెల 25న కళశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభిస్తారని 27న పూర్ణాహుతితో ముగుస్తాయన్నారు. 26న మహా శివరాత్రి ఉదయం 5 గంటల నుంచి స్ఫటిక లింగ దర్శనం ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు క్యూలైన్‌లలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించామని వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శశికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



అనూహ్యం నాటికలో సన్నివేశం

సందేశాత్మకంగా నాటికలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):సంస్కృతి, సంప్రదాయాలతో పాటు సమాజంలోని వాస్తవ పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు చూపించే ప్రతిబింబాలే నాటికలు అని సినీ విజ్ఞాన విశారద ఎస్.వి రామారావు, యువ కళావాహిని అధ్య క్షుడు లంకా లక్ష్మీనారాయణ అన్నారు. వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో గరికపాటి ఆర్ట్‌థియేటర్ 274వ కార్యక్రమంలో భాగంగా నాటకో త్సవాలు కళాప్రియులను ఆకట్టుకున్నాయి. రెండురోజుల పాటు జరిగే నాటకోత్సవాలను వారు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారం భించారు.

సందేశాన్నిచ్చిన అనూహ్య నాటిక

తల్లిదండ్రుల వారసత్వ సంపదను, కష్టార్జితాన్ని కన్నకొడు కులు హక్కుల పేరుతో, కుటిల నీతితో దక్కించుకోవాలని చూస్తున్నారని, కన్నబిడ్డలు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరి స్తున్నారన్న ఇతివృత్తంతో ప్రదర్శించిన అనూహ్యం నాటిక ఆహుతులను ఆకట్టుకుంది. నటీనట సంక్షేమసమాఖ్య పాలకొల్లు ఆధ్వర్యంలో అనూహ్యం నాటిక సందేశాత్మకంగా సాగింది.

ఆకట్టుకున్న తరమెల్లి పోతున్నదో

తండ్రి సంపాదిస్తున్న ఆస్తిని పంచుకోవడానికి కొందరు జీవితాంతం శత్రువులుగా మారుతున్నారు. వారి ఇళ్లల్లో పండుగలు జరుగుతుంటే ఊరందరిని పిలుస్తారు. తోడబుట్టిన వారిని మాత్రం పిలవరు. మరణించిన ఆ మనిషి బ్రతికే ఉంటే అతని జన్మ గొప్పదనే కథాంశంతో రూపొందించిన 'తరమెల్లిపోతున్నదో' నాటిక సందేశాత్మకంగా సాగింది. కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ గుంటూరు ఆధ్వర్యంలో నాటిక ప్రదర్శించారు.

నెట్‌బాల్‌లో జిల్లా బాలికల జట్టుకు ప్రథమ స్థానం



పోటీల్లో పాల్గొన్న స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ హైస్కూల్ బాల బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాలకోడేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16, 17 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలోని డాన్ బాస్కో హైస్కూల్‌లో జరిగిన 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ అండర్-19 బాలబాలికల నెట్ బాల్ పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచిందని, బాలుర జట్టు తృతీయ స్థానం గెలిచారని స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీదేవి తెలిపారు. స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులైన డి.జ్యోత్స్న నాగసాయి (8వ తరగతి), ఏ.పోషిత (9వ తరగతి) జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానం గెలవడంలో, బాలుర జట్టు తృతీయ స్థానాన్ని సాధించగా ఆ బాలురు జిల్లా జట్టులో కె.లోకేష్ (9వ తరగతి), బి.రమేష్ (9వ తరగతి) విజయంలో కీలకపాత్ర వహించారని పాఠశాల పిడి ఎస్. విజయలక్ష్మి తెలిపారు. ఈ నెట్ బాల్ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను, పీడీ విజయలక్ష్మిలను ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీదేవి అభినందించారు.



నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉయ్యాలవాడ వర్ధంతి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వద్ద శనివారం డాక్టర్ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు నరసింహారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటిష్‌వారిపై తొలినాళ్లలో తిరుగుబాటు చేసి తెలుగువారి పౌరుషాన్ని చూపిన యోధుడు నరసింహారెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు డాక్టర్ ఎల్ నారం నాయుడు, డాక్టర్ బి.ప్రసన్న కుమార్, డాక్టర్ ఎస్ సూర్యకుమారి, డాక్టర్ కేటిఇ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇస్తామని నిలువు దోపిడీ
ఇద్దరి అరెస్టు

తణుకు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రహదారుల్లో ఒంటరిగా వున్న వ్యక్తులను బైక్‌లపై లిఫ్ట్ ఇస్తామని నమ్మబలికి వారిని నిర్మానుష ప్రదేశాలకు తీసుకెళ్లి మారణాయుధాలతో బెదిరించి నిలువుదోపిడీ చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.చంద్రశేఖర్ తెలిపారు. తణుకు సీఐ కృష్ణకుమార్ సిబ్బంది నిందితులను తణుకు తేతలి వైజంక్షన్‌లో ఈనెల 21వ తేదీన అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బుట్టాయిగూడెం మండలం కె రామచంద్రపురం గ్రామానికి చెందిన ప్రస్తుతం పైడిపర్రులో వుంటున్న ఏలూరి ప్రేమ్ కుమార్, వీరవాసరం మండలం నవుడూరు గ్రామానికి చెందిన ప్రస్తుతం పైడిపర్రులో వుంటున్న కాపా సుధాకర్‌లు రహదారులు, జంక్షన్‌లలో వంటరిగా వున్న వారికి బైక్‌లపై లిఫ్ట్ ఇస్తా మని నమ్మబలికి వారిని బైక్‌లపై ఎక్కించుకుని నిర్మానుష ప్రదేశాలకు తీసుకెళ్లి వారి వద్ద ఉన్న నగదు, నగలు, మొబైల్ ఫోన్‌లను కాజే స్తున్నట్లు అందిన పిర్యాదు మేరకు దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిపై తణుకు పట్టణం, రూరల్ పోలీస్ స్టేష న్లలో మొత్తం 6 కేసులు నమోదైనట్లు తెలి పారు. వీరి వద్ద నుంచి 41 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు టచ్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ. 2 లక్షల 87 వేలు వుంటుందని తెలిపారు.

ఎస్పీకి ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల వినతి

ఆచంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వాట్సప్ గ్రూపుల ద్వారా కొన్ని న్యూస్ చానల్స్ ప్రతినిధులపై అసత్య ప్రచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా తరుపున అధ్యక్షుడు జక్కంశెట్టి శ్రీనివాసరావు శనివారం ఎస్పీకి వినతి పత్రం అందించారు. భవిష్యత్తులో ఇటువంటి అసత్య ప్రచార పోస్టులు పెట్టకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీని కోరారు.



భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా

సీసీ కెమెరా చూస్తోంది!

- అన్ని పోలీసు స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటు
- సుప్రీం కోర్టు ఆదేశాలతో కదలిక
- పారదర్శకత కోసమే ఈ చర్యలు

సహజంగా పోలీసులపై అనేక ఆరోపణలు వస్తుంటాయి. పోలీస్ స్టేషన్లలో సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయంటారు.. అకారణంగా నిందితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని చెబుతారు.. సకాలంలో కోర్టులకు నిందితులను హాజరుపర్చడం లేదని.. రోజుల తరబడి స్టేషన్లలో చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆరోపిస్తారు.. వచ్చిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టకుండా బాధితులను వేధింపులు చేస్తున్నారు.. అంటూ ఇలాంటి ఆరోపణలు ఎక్కువగా వింటాం. వాస్తవంగా అన్ని పోలీసు స్టేషన్లలో ఇలాంటి పరిస్థితులు ఉండవు. పోలీసులపై వస్తున్న ఈ ఆరోపణలను పూర్తిగా కొట్టిపారేయలేము గాని నిరంతరం క్రిమినల్స్ వేటలో ఉండే పోలీసులు కూడా ఎన్నో ఒత్తిడిలు ఎదుర్కొంటున్నారు. ఎందరో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్నారు. ఏదిఏమైనా పారదర్శకత కోసం సీసీ కెమెరాలు తెరపైకి వచ్చాయి. సుప్రీంకోర్టు చర్యలు చేపట్టింది. అన్ని పోలీసు స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గతంలోనే సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో దేశంలో అన్ని పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2022లో సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇవ్వగా 2023లో పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఏలూరు జిల్లాలో పట్టణ పోలీస్ స్టేషన్లలో 10 కెమెరాలు, రూరల్ పోలీస్ స్టేషన్లలో 8 కెమెరాల వంతున అమర్చారు. జిల్లాలోని లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లతో పాటు సీసీఎస్, ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్లు మొత్తం 39 ఉన్నాయి. వీటిలో 352 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలు సంబంధిత ఎస్‌హెచ్‌వో రూములో, జిల్లా పోలీస్ కార్యాలయానికి లింకు, డీజీపీ కార్యాలయానికి లింకును కలిపి ఉంచారు. దీంతో స్టేషన్‌కు ఎవరైనా బాధితులు వచ్చి వెయిటింగ్ రూములో గాని, రిసెప్షన్ కౌంటర్ వద్ద కాని ఉంటే ఎస్‌హెచ్‌వో తన రూములో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి వెంటనే ఆయన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంది. అంతేకాకుండా బాధితులు ఎప్పుడు వచ్చారు. ఎప్పుడు ఫిర్యాదు ఇచ్చారు అనేవి స్పష్టంగా రికార్డు అవుతూనే ఉన్నాయి. ఎవరైనా లంచాలకోసం వేధించినా ప్రతిదీ కూడా స్టేషన్‌లో రికార్డు అవుతూనే ఉంటాయి. ఇంచుమించు ఆ స్పీకర్లు వాయిస్‌ను రికార్డు చేయగలవని చెబుతున్నారు. పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో సహాయ పడతాయని తెలుస్తుంది.

సీసీ కెమెరాలకు మరమ్మతులు

పశ్చిమగోదావరి జిల్లాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేక పోవటంతో కొన్ని పని చేయడం లేదు. ఇటీవల హైకోర్టు ఆదేశాలతో అధికారుల్లో చలనం వచ్చింది. హుటాహుటిన కొన్ని స్టేషన్లలో కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. మిగిలిన కొన్ని స్టేషన్లలో కెమెరాలకు మరమ్మతులు చేస్తున్నారు.

ఏలూరు జిల్లాలో కెమెరాలు పని చేస్తున్నాయి : ఎస్పీ కిశోర్



స్టేషన్‌లో జరిగే ప్రతి అంశం సీసీ కెమెరాలో రికార్డు అవుతూనే ఉంటాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం, ముద్దాయిలను అరెస్టు చేస్తే 24 గంటల్లో కోర్టుకు హాజరుపర్చడం లాంటివి పారదర్శకంగా జరుగుతున్నాయి. పోలీసుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే ఉన్నాము. మెరుగుపర్చడానికి తగిన ఆదేశాలు, సూచనలు చేస్తూనే ఉన్నాం. అనవసర ఆరోపణలకు తావులేకుండా సీసీ కెమెరాలు అందరికి ఉపయోగార్థంగా ఉంటున్నాయి. అన్ని కెమెరాలు స్పష్టంగా పనిచేస్తున్నాయి

పశ్చిమలో 28 పోలీస్ స్టేషన్లు

పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 25 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు, మూడు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో చిన్న స్టేషన్లకు 6 నుంచి 8 కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. పట్టణ పోలీస్ స్టేషన్‌లలో 10 నుంచి 15 కెమెరాలను ఏర్పాటు చేయాలి. పట్టణ పోలీస్ స్టేషన్లలో కెమెరాల నిర్వహణ కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ మండలాలకు సంబంధించిన పోలీస్ స్టేషన్లలో కెమెరాలపై అంత శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కెమెరాల పనితీరు

పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కెమెరాలకు సంబంధించిన రికార్డింగ్‌ను ఉన్నతాధికారులు అవసరం వచ్చినప్పుడు పరిశీలిస్తారు. స్టేషన్‌కు సంబంధించి ఏదైనా ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కెమెరాల రికార్డింగ్‌ను పరిశీలించి సంబంధిత అధికారులపై చర్యలకు ఆదేశాలు ఇస్తారు. కక్షిదారులు ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో సన్నిహితంగా మెలగాలని, అలాగే వారిచ్చిన ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయవలసిన అవసరం స్టేషన్ అధికారులపై ఉంటుంది. కొందరు అధికారులు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలోనే కోర్టు కెమెరాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్న విషయాన్ని కొందరు చెబుతున్నారు.

సాక్ష్యాలుగా సీసీ కెమెరాలు

- ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏడాదిన్నర క్రితం స్టేషన్ రైటర్ ఒక వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అతనిని అరెస్టు చేశారు. మరో ఏఎస్ఐని కూడా అరెస్ట్ చేశారు. అయితే ఆ కేసులో సాక్ష్యంగా సీసీ ఫుటేజీని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసు కున్నారు.
- ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది ఏప్రిల్ నెలలో ఏసీబీ అధికా రులు దాడి చేసి సీఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లను అరెస్టు చేశారు. ఈ కేసు లో కూడా ఏసీబీ అధికారులు స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజిలనే సాక్ష్యంగా పెట్టుకున్నారు.
- ఏలూరు నగరంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగానే నగరంలో దొంగలను పోలీసులు గుర్తించి అరెస్టు చేస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగ సమయ ంలో ఏలూరు వన్‌టౌన్‌లోని బంగారు షాపు గోడ తవ్వి చోరీకి పాల్పడిన ఉత్తర ప్రదేశ్ ముఠాను సీసీ కెమెరాల ఫుటేజ్‌ల ఆధారంగానే గుర్తించి అరెస్టు చేసి చోరీ సొత్తును రికవరీ చేశారు. ఇంకా మరి కొన్ని కేసుల్లో కూడా పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.
- నగరంలో మహిళల రక్షణ కోసం జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ నూతనంగా ప్రవేశపెట్టిన అభయ మహిళా రక్షక టీమ్ నగరంలో విస్తృతంగా తిరుగుతూ ఎక్కడి కక్కడే మహిళలకు, బాలికలకు, యువ తులకు రక్షణగా మేము ఉన్నామంటూ ఆత్మస్థైర్యం కల్పిస్తున్నారు. అంతేకాకుండా డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి ఉదయం స్కూళ్ళు, కాలేజీలు ప్రారంభమయ్యే సమ యంలో సాయంత్రం స్కూళ్ళు, కాలేజీలు వదిలిపెట్టే సమయంలో విద్యార్థినులను ఎవరైనా ఆకతాయిలు వేధించినా వారిని వెంటనే గుర్తించడానికి ఈ డ్రోన్ కెమెరా లను ఉపయోగిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండండి

ఏలూరు జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి

ఏలూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధుల పట్ల పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఎన్నికల నిర్వహణపై పీవో, ఏపీవోలకు రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో విధులు, పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించారు. పలు సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని వివరించారు. బ్యాలెట్ పేపర్‌ను ఏ విధంగా మడతపెట్టి బ్యాలెట్ బాక్సులో వేయాలో వివరించారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సుల స్వీకరణ, స్టాట్యూటరి, నాన్ స్టాట్యూటరీ కవర్లు, పోలింగ్ మెటీరియల్ చెక్ లిస్టు ప్రకారం పరిశీలించుకుని తీసుకోవాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనీస్ శ్రీనివాస్, ఫణిలు ఓటు వేసే విధానం, పోలింగ్ సిబ్బంది నియామకం, పోలింగ్ మెటీరియల్, ముఖ్యమైన ఎన్నికల సామగ్రి తనిఖీ, పోలింగ్ కేంద్రానికి చేరిన వెంటనే చేయాల్సిన విధులపై వివరించారు. పోలింగ్ కేంద్రంలోని ప్రవేశార్హత, ఓటరు జాబితా, ఛాలెంజ్ ఓటు, టెండరు ఓటు, అంధులు, నిస్సహాయ ఓటర్లకు బ్యాలెట్ సిద్ధం చేయడం పోలింగ్ ఏజెంట్లు గమనించాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికల అధికారులకు బ్యాలెట్ బాక్సు ఓపెన్ చేయడం, క్లోజ్ చేయడం ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో కె విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి పాల్గొన్నారు.

ఆస్పత్రి ఫార్మసీ గదిలో వీడియో గేమ్

సోషల్ మీడియాలో చక్కెర్లు కొడుతున్న వీడియో



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి లోని ఫార్మసీ గదిలో వీడియో గేమ్ ఆడుతున్న బాలుడు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి పనిగంటల సమయంలో రోగులకు మందులు ఇచ్చే ఫార్మసీ గదిలో కంప్యూటర్ లో వీడియో గేమ్స్ ఆడుతూ ఉన్న వీడియో సోషల్ మీడియాలో చక్కెర్లు కొడుతున్నది. ఈ ఘటనతో ఆసుపత్రి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తున్నది. ఫార్మసీ సిబ్బంది తమ పనులు చేసుకుంటూనే ఉన్నారు. బాలుడు తన పాటికి తాను వీడియో గేమ్ ఆడుతూనే ఉన్నాడు. కానీ ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదు. ఈ ఘటనపై పలు విమర్శలు వినబడుతున్నాయి.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్‌కుమార్

బాలల సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బాలల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాలు రూపొందించబడ్డాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. సునీల్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో జువైనల్ యాక్ట్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ బాలల సంక్షేమ చట్టాలు అమలు చేయడం కోసం ఎప్పటికప్పుడు అధికారులు కృషి చేయాలని సూచించారు. చట్టంతో విభేదించిన బాలలతో ప్రవర్తించవలసిన విధి విధానాలను అలాగే వారికి కల్పించాల్సిన పునరావాస సౌకర్యాలపైన ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. నేటి సమాజంలో బాల్య వివాహాలు అక్కడక్కడ కొనసాగుతున్నాయని, వీటిని సమష్టి కృషితో నిరోధించాలని సూచించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కెకె బులికృష్ణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమెన్ అండ్ ఛైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ శారద, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా డీసీపీవోలు సూర్యచక్రవేణి, రాజేష్, ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ శ్రీవల్లి, సీడబ్ల్యూసీ మెంబర్ పి.వెంకటేశ్వరరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీవీఎన్ మునీశ్వరరావు, ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులపై విజిలెన్సు దాడులు



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) :విజిలెన్సు డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు, సీఐలు పి.శివరామకృష్ణ, డి .ప్రసాద్‌కుమార్, ఎస్ఐ కె సీతారామ్ వారి సిబ్బంది కలిసి ఏలూరు, భీమవరాలలో శనివారం విస్తృతంగా పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. ఏలూరులోని మెస్సర్స్ శ్రీమౌర్య ఫ్యూయల్స్, మెస్సర్స్ పార్వతీ ఎనర్జీ స్టేషన్, భీమవరంలో మెస్సర్స్ పృథ్వీ ఫిల్లింగ్ స్టేషన్, మెస్సర్స్ పుష్ప సర్వీసెస్ సెంటర్లలో పెట్రోల్, డీజిల్ నిల్వలను తనిఖీలు చేశారు. అగ్ని మాపక నియంత్రణ పరికరాలు, డెన్సిటీ కొలతల తేడాలు, స్టాక్ బుక్‌లో తేడాలు, ఇన్‌వాయిస్ బిల్లులను తనిఖీలు చేశారు. పెట్రోల్ బంకులలో చిప్‌లు ఏమైనా అమర్చారా అని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. మెస్సర్స్ పుష్పా సర్వీసెస్ సెంట్రల్ 16 నాజల్స్ తనిఖీలు చేయగా అందులో ఒక నాజల్‌లో ఐదు లీటర్ల ప్రామాణిక కొలతకు 30 మిల్లీ లీటర్ల తక్కువ పరిమాణం వచ్చినట్లు గుర్తించారు. దీంతో ఎల్‌ఎంయాక్టు 2009 ప్రకారం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎవరైనా పెట్రోల్ బంకుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



శనివారం పవర్‌పేట రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద రద్దీ

రంగంలోకి దిగిన రైల్వే అధికారులు

పత్తాలేని ఏజెంట్లు .. వచ్చినవారికందరికీ లభించిన తత్కాల్ టిక్కెట్లు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్‌లో ఏజెంట్లదే పవర్ అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. ఆఘమేఘాల మీద విజయవాడ నుంచి ప్రత్యేక బృందాలు ఏలూరు చేరుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టారు. మరోవైపు ఏలూరు రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ శనివారం ఉదయమే పవర్‌పేట చేరుకుని అక్కడ ఉన్న ఉద్యోగులను విచారించారు. మరోవైపు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పవర్‌పేట రైల్వే స్టేషన్‌లోనే ఉండి తత్కాల్ టిక్కెట్ల జారీ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. ఒకొక్కరు ఎన్ని టిక్కెట్లు తీసుకుంటున్నారో కూడా ఆయన పరిశీలించారు. విజయవాడ రైల్వేశాఖకు చెందిన నిఘా విభాగాల అధికారులు కూడా శనివారం ఏలూరు నగరానికి చేరుకుని పెద్ద రైల్వేస్టేషన్, పవర్‌పేట స్టేషన్లలో తమదైనశైలిలో విచారణ చేపట్టారు. మొత్తం మీద తత్కాల్ టిక్కెట్లను రిజర్వేషన్ చేసుకోవడానికి రోజూ వచ్చే ఏజెంట్లు శనివారం నాడు దరిదాపుల్లో రాకపోవడం గమనార్హం. ఇంకా రోజు తత్కాల్ టిక్కెట్ల కోసం రిజర్వేషన్ ఫామ్స్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద సీరియల్ నెంబర్ వేసి ఉంచేవారు. కాని శనివారం అవి కూడా లేకుండా వాటిని తీసుకుని ఏజెంట్లు పరారీ అయ్యారు. శనివారం నాడు తత్కాల్ రిజర్వేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికి టిక్కెట్లు పట్టుకుని సంతోషంగా తిరిగి వెళ్ళారు. తమ ప్రయాణానికి రైల్వే టిక్కెట్లు దొరికాయంటూ ముచ్చటపడుతూ వెళ్ళిపోయారు. మొత్తం మీద ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి రైల్వే అధికారులు స్పందించి గట్టి నిఘా పెట్టారు.

భర్త మరణం తట్టుకోలేక.. ఆత్మహత్య

కలిదిండి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవిత చరమాంకంలో అన్నీ తానై చూసుకుంటున్న భర్త మరణాన్ని తట్టుకోలేక పోయింది. మానసికంగా స్థిమితం కోల్పోయింది. ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయతాన్నికి పాల్పడింది. చివరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ లోకాన్ని విడిచింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. పెదలంక పంచాయతీ పరిధి పల్లిపాలెంకు చెందిన బొడ్డు మారెమ్మ (72) భర్త నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా వివాహాలై వెళ్లిపోవడంతో చాలా కాలం నుంచి మారెమ్మ దంపతులిద్దరే ఉంటున్నారు. ఈ క్రమంలో నాలుగు నెలల కిందట భర్త అనా రోగ్యంతో మృతి చెందడంతో మారెమ్మ తట్టు కోలేక పోయింది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయి మతి స్థిమితం కోల్పోయింది. చివరకు ఈ నెల 18న ఎలుకల మందును నీటిలో కలుపుకుని తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కైకలూరు ప్రభుత్వాస్పత్రికి ఆపై ఏలూ రు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిన్న చోరీ.. నేడు రికవరీ!

దొంగ అరెస్టు.. 49 కాసుల బంగారం స్వాధీనం... పరారీలో మైనర్

ఆచంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పెనుగొండలో తాళం వేసిన ఇంటిలో సుమారు 25 లక్షలు విలువ చేసే 49 కాసులు బంగారం ఆభరణాలు శుక్రవారం చోరీ జరగ్గా ఈ కేసును 24 గంటల్లో చేధించడం పట్ల జిల్లా ఎస్పీ నయాం అస్మి పోలీసులను అభినందించారు. శనివారం ఆచంట పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బంగారం చోరీ వివరాలను ఎస్పీ వివరించారు. పెనుగొండకు చెందిన గుబ్బల లక్ష్మీనారాయణ దంపతులు ఈ నెల 17న తమ ఇంటికి తాళం వేసి షిర్డీ యాత్రకు వెళ్ళగా తిరిగి 21న తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటిలో ఉన్న 49 కాసుల బంగారు వస్తువులను దొంగలు దోచుకుపోవడం జరిగిందని బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. నరసాపురం డీఎస్పీ జి. శ్రీవేద నేతృత్వంలో పెనుగొండ శివారు చిన్నంవారి పాలెం సిద్ధాంతం రోడ్డు వద్ద నివాసం ఉంటున్న నిందితుడు కోనూరి పోతురాజును అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మైనర్ అయిన మరో యువకుడు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నేరస్తుడిని 24 గంటల్లో అరెస్టు చేసి చోరీ సొత్తు రికవరి చేసిన డీఎస్పీ శ్రీవేద, సీఐ రాయుడు విజయకుమార్, ఎస్ఐలు గంగాధరరావు, స్వామి కేవీ రమణలను అభినందించారు. చోరీకి గురైన తమ బంగారాన్ని 24 గంటల్లో తిరిగి తమకు అప్పగించిన పోలీసులకు బాధితులు లక్ష్మీ నారాయణ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు

ఆచంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్ల దొంగతనం కేసులో అరెస్టు అయ్యి గత సంవత్సరం నవంబరు 4న నరసాపురం సబ్‌జైలు నుంచి రిలీజ్ అయిన మత్స్యపురికి చెందిన కారేపల్లి ఏసురత్నంను పోలీసులు అరెస్టు చేశారు. జైలు నుంచి విడుదలైన ఏసురత్నం కదలికలను పరిశీలించారు. అనుమానం వచిచ ఏసురత్నంను విచారించగా అతను జైలు నుంచి వచ్చిన తరువాత పాలకొల్లు, పోడూరు, పెనుమంట్ర పరిధిలో 10 మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్లు చెప్పాడు. అతని వద్ద నుంచి చోరీకి గురైన పది మోటారు సైకిళ్లను రికవరి చేసినట్టు డీఎస్పీ శ్రీవేద తెలిపారు. అరెస్టు కాబడిన ఏసురత్నంపై గతంలో నరసాపురం టౌన్, రూరల్, పాలకొల్లుటౌన్, భీమవరం టౌన్ ,అత్తిలి, మొగల్తూరుల్లో మోటారు సైకిళ్ల దొంగతనాలు కేసులు ఉన్నాయన్నారు.



రికవరీ చేసిన బంగారు ఆభరణాలను చూపిస్తున్న ఎస్పీ నయీం అస్మి

మహిళల అదృశ్యంపై ప్రత్యేక దృష్టి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహిళల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించేలా జిల్లాలో పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయాం అస్మి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ వద్ద కేసుల వివరాలతోపాటు, పోలీస్‌స్టేషన్ సమాచారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. స్నేహపూర్వక పోలీసింగ్ అనుసరిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.విశ్వనాథ్, సీఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషన్ వద్ద రౌడీషీటర్ హల్‌చల్

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తమ వారిని పోలీస్‌స్టేషన్‌కు పట్టుకొస్తారా... ప్రభుత్వం మారిందని దీమానా అంటూ సూర్యచంద్రరావుపేటకు చెందిన ఓ రౌడీషీటర్ ద్వారకాతిరుమల పోలీసు స్టేషన్ ముందు శనివారం రాత్రి చిందులు తొక్కాడు. తమ వాళ్లను విడిచి పెట్టాల్సిందే అంటూ హడావుడి చేశాడు. సూర్యచంద్రరావు పేటలో జరుగుతున్న కోడిపందేల స్థావరంపై ద్వారకాతిరుమల పోలీసులు శనివారం దాడి చేశారు. ఈక్రమంలో 11మంది పందెగాళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.21,110 నగదు, నాలుగు బైక్‌లు, కోడిపుంజును స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో ఆ రౌడీషీటర్ స్టేషన్ వద్దకు వచ్చి చేసిన హడావుడి అంతాఇంతా కాదు. దీన్ని గమనించిన ఎస్సై సుధీర్ సదరు రౌడీషీటర్‌ను మందలించి పంపి వేశారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు : సీఐటీయూ

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్(ఆప్కాస్)ను రద్దు చేయాలనే ప్రభుత్వం ఆలోచన విరమించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు కాంట్రాక్టర్లకు, కార్మికులకు అప్పజెప్పడానికి వీల్లేదన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరావు, హనుమంతరావు, జార్జ్, నాగరాజు, దావీదు, కిశోర్ పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటాం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో నగర ప్రజలు తాగు నీటికి ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ ఏ.భాను ప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు. శనివారం దెందులూరు మంచి నీటి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ గోదావరి జలాలు కాల్వ ద్వారా పూర్తిస్థాయిలో రాకపోవడంతో చెరువులో నీటి నిల్వలు తగ్గాయన్నారు. నీటిని వదలాలని జిల్లా కలెక్టర్‌కు తెలిపామన్నారు.కొత్తమోటార్లు కూడా కొనుగోలు చేశామన్నారు.

అక్షరాస్యతపై విద్యార్థినులకు అవగాహన

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : యువతకు ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై శనివారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో బీకాం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం జరిగింది. రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ ప్రతినిధి సి.హెచ్. విజయ్ కుమార్ మాట్లాడుతూ పెట్టుబడులు, సెక్యూరిటీలు, ఉద్యోగావకాశాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, పరీక్షలవిభాగం కంట్రోలర్ సిస్టర్ సుశీల పాల్గొన్నారు.

నీలాద్రిపురంలో ఆయుర్వేద వైద్య శిబిరం

ఉంగుటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) :గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆయుర్వేద వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు ఆయుర్వేద వైద్యాధికారిణి కస్తూరి శిరీష కోరారు. శనివారం మండలంలోని నీలాద్రిపురంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోకాళ్ల నొప్పులు, చర్మవ్యాధుల రోగులను పరీక్షించి వైద్య సలహాలిచ్చారు. ఆయుర్వేద వైద్య విధానంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 115 మంది రోగులకు పరీక్షలు జరిపి మందులు అందించారు.

ఉద్యోగుల సమస్యలపై బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, పాత బకాయిలు, డీఏ, ఐఆర్, పీఆర్సీ కమిటీపై సోమవారం నుంచి జరిగే బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఎస్‌పై ఏడాదిలోపు నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

యోగాపై నేడు శిక్షణ తరగతులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో ధ్యానం చాలా ప్రాధాన్యమైందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రాచీన భారతీయ ఆధ్యాత్మిక యోగా ధ్యానం గురుపరంపరలో ఖ్యాతిగాంచిన స్వామి మైత్రేయ అన్నారు. శనివారం గోసంరక్షణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధ్యానయోగాపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు పెరుగుచెట్టు సెంటర్లోని పి.ఎస్.ఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 24 నుంచి మార్చి 5వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ప్రేమాలయం నిర్వాహక కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ గురూజీ, ఆలపాటి నాగేశ్వరరావు, టి.లక్ష్మి, బి.వి సుబ్రహ్మణ్యం, జి.రామారావు, కె.సత్యనారాయణ, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయాల్లో మాఘమాసం పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : మాఘమాసంను పురస్కరించుకుని శ్రీవారి ఆలయాల వద్ద భక్తులు స్వామికి తులసీదళాలు, పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు అమ్మవార్లకు, స్వామివారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో రామచంద్రరావు పేటలోని, అశోక్ నగర్‌లోని శ్రీవారి ఆలయాల వద్ద, పవరుపేటలోని వాసుదేవ ఆలయం వద్ద, అగ్రహారంలోని జనార్ధన స్వామి ఆలయాల వద్ద సందడి నెలకొంది.

వైకల్యం నివారణపై అవగాహన

పెదపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో వైకల్యం - నివారణపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీవో సునీల్ రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ వైకల్యాన్ని ముందుగా గుర్తిస్తే నివారించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, ఫాతిమా, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

సంస్థల ద్వారా వేతనాలు చెల్లించాలి : ఏఐటీయూసీ

ఏలూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ నగరపాలక సంస్థల్లో, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందికి సంస్థల ద్వారా వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ. అప్పలరాజులు డిమాండ్ చేశారు. శనివారం కోటదిబ్బ వద్ద ఉన్న సర్వీస్ రిజర్వాయరు వద్ద మస్టర్ సమయంలో ఉద్యోగులు కొంతసేపు నిరసన తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వారి వెంట హరినాథ్ బాబు, దుర్గాప్రసాద్, ఎస్.ఎం.వి.సుబ్బారావు, ఎస్.గౌరీ శంకర్, బాజీ ఉన్నారు.

యుద్ధ ప్రాతిపదికన శానిటేషన్ డ్రైవ్

ఏలూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో పలు పంచాయతీల్లో శనివారం ఎంపీడీవో ఇ.శ్రీనివాస్ మెగా శానిటేషన్ డ్రైవ్ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించారు. పోలవరం, గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, కొత్తరామయ్యపేట, ఇటుకలకోట, పంచాయతీల్లో తడి, పొడిచెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. గ్రామస్థులు చెత్త సేకరణ విషయంలో సిబ్బందికి సహకరించాలని ఎంపీడీవో కోరారు.

పారిశుధ్యంపై రెండ్రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్

భీమడోలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో శానిటేషన్‌పై రెండ్రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శనివారం గుండుగొలనులో ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీడీవో పద్మావతి దేవి పాల్గొని ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తలను వేరే చేసే విధానాన్ని వివరించారు. భీమడోలు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్షలను వాయిదా వేయాలని గ్రూపు-2 అభ్యర్థి పి.రఘురామ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద అభ్యర్థులు శనివారం ఆందోళన నిర్వహించారు. అ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ గ్రూపు-2 నోటిఫికేషన్‌లో రోస్టర్ విధానం తప్పుగా ఉందని దాని వలన నిరుద్యోగులు నష్టపోతారని అన్నారు. రోస్టర్ విధానాన్ని సరిచేసి తరువాత పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈనెల 23న జరగబోయే గ్రూపు-2 పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.



న్యాక్ బృందంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు

ఏలూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బెంగళూరు నేషనల్ అసెస్మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ నుంచి గుర్తింపు పొంది బి-ప్లస్ గ్రేడ్‌ను సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ గ్రేడు ఐదేళ్ల పాటు కొన సాగుతుందని ఆయన తెలిపారు. కమిటీ పరిశీలన అనంతరం ఈ నెల 21న న్యాక్ కమిటీ కళాశాలకు గుర్తింపునిచ్చినట్టు ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు తెలిపారు. తమ కళాశాలకు న్యాక్ గుర్తింపు రావడానికి కృషి చేసిన ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ మట్టా మధు, అసిస్టెంట్ కో-ఆర్డి నేటర్ కె.ఉత్తమ సాగర్‌కు అభినందనలు తెలిపారు.

పుల్లల లోడుతో వెళ్తూ తిరగబడిన ట్రాక్టర్

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):జామాయిల్ లోడుతో వెళుతున్న ట్రాక్టరు అదుపుతప్పి మండలంలోని కొమ్ముగూడెం సెంటరు మలుపులో తిరగబడింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బుట్టాయగూడెం వైపుగా వస్తున్న జామాయిల్ లోడుతో ఉన్న ట్రాక్టరు మలుపు తిరుగుతుండగా అదుపుతప్పి ఇంజన్ నుంచి ట్రక్కు విడిపోయింది.దీంతో ట్రక్కు ఒక్కసారిగా తిరగబడింది. పుల్లలు పక్కనే ఉన్న షాపులపై పడటంతో కొద్దిపాటి నష్టం వాటిల్లింది.

వేసవి ఉపశమనానికి గ్రీన్ నెట్స్

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎండలు భగ్గుమంటున్నాయి. కాలు కిందపెడితే చుర్రుమంటోంది.. ఇలాంటప్పుడు క్యూలలో నిల్చోవాలంటే పెద్ద సమస్యే.. ఈ సమస్యకు ఏలూరు నగరపాలక సంస్థ తాత్కాలిక ఉపశమనానికి మార్గం కనిపెట్టింది. అన్నా క్యాంటీన్ల వద్ద భోజనం కోసం ఎండలో నిలబడేందుకు ఇబ్బందులు పడుతున్న వారి కోసం గ్రీన్‌నెట్స్ ఏర్పాటు చేసింది. ఏలూరులోని ఇండోర్ స్టేడియం, రామచంద్రరావుపేట వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగర పాలక సంస్థ అధికారుల ప్రయోగాత్మక చర్యలతో ఒకింత ఉపశమనం దొరుకుతోంది. నగర పాలక సంస్థ గ్రీన్‌నెట్స్ ఏర్పాటు చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులతో ఎంపీ మహేష్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిని చూసి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అభ్యర్థిని గెలిపిస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు, నాయకులు ఎంవీఎస్ శర్మ, గంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

ఏలూరు రూరల్ : రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గా ప్రసాద్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ బ్రాహ్మణ సామాజిక వర్గంలోని పట్టభద్రులంతా రాజశేఖరం గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమితో ప్రజాసంక్షేమం సాధ్యమని, ప్రజలపక్షాన నిరంతరం పనిచేసే పార్టీ అని కొనియాడారు.



దుర్గా ప్రసాద్

లింగపాలెం : లింగపాలెంలోని పలువురు గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయులను కలిసి నాయకులు తాతిన రాధా

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలని కూటమి నాయకుల ప్రచారం

కృష్ణ, మోరంపూడి ప్రసాద్, మోరంపూడి మల్లికార్జున్ రావు, గారపాటి బుజ్జియ్య, బొంతు రాంబాబు, సిహెచ్ రామ్మోహన్‌రావు, జి.వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రావు, బొంతు శ్రీను ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి రాజశేఖరంకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

భీమడోలు : భీమడోలులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శనివారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి : నాయకులు బోడా అనీష్ కుమార్, మారుమూడి థామస్, చిట్లూరి ధర్మరాజు, అట్లూరి శ్రీనివాసరావులు చింతలపూడి పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు రాజశేఖరం గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ ప్రచారంలో కె.రాజశేఖర్ రెడ్డి, బొద్దాని నాగవర్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదపాడు : మండలంలోని కొత్తూరు, పాతముప్పర్రు, వీరమ్మ కుంట, పెదపాడు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పర్యటించి ప్రచారాన్ని నిర్వహించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు రాజశేఖరం గెలుపునకు సహకరించాలని కోరారు.



టీడీపీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచారం

కామవరపుకోట : పట్టభద్రులను, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులను శనివారం మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావుల బృందం కామవరపు కోటలో కలిసి ఓట్లు అభ్యర్థించారు.

కొయ్యలగూడెం : కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలని టీడీపీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక వివిధ పాఠశాలల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యల పరిష్కారం కావాలంటే రాజశేఖర్‌ను గెలిపించుకోవాలని కోరారు. పట్టభద్రులంతా ఆయన విజయానికి కృషి చేయాలని కోరారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

పెదపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సర్‌సీఆర్ రెడ్డి మహిళా కళాశాల 38వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఏలూరు అడిషనల్ జిల్లా, సెషన్స్ జడ్జి పి.మంగాకుమారి పాల్గొని విద్యార్థినులనుద్దేశించి ప్రసంగించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, చట్టాలని దుర్వినియోగం చేయకుండా సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రెసిడెంట్ వి.వి.బాల కృష్ణారావు మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు వచ్చిన లక్ష్య సాధనలో ముందుకు సాగాలన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి



ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరస్వతితో అంగన్‌వాడీలు

దెందులూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేలా టీచర్లు కృషి చేయాలని దెందులూరు సెక్టార్ సూపర్ వైజర్లు చిట్టమ్మ, శ్రీదేవి పద్మ భూషణం అన్నారు. శనివారం దెందులూరు శ్రీ గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో నాల్గవ రోజు మండలంలోని అంగన్వాడీ టీచర్లకు హెచ్ఎం మల్లిఖార్జునరావు, ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలకు నిర్వహించే శ్రీమంతాలు, అన్నప్రాసనలు, పండుగ వేడుకలను కేంద్రాల్లో అంగన్వాడీ టీచర్లు ఎలా నిర్వహించాలనే అంశంపై రిసోర్స్ పర్సన్లు పాండు రంగరావు, జయపాల్‌లు శిక్షణ ఇచ్చారు.

కొయ్యలగూడెం : పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ అంబటి సరస్వతి

విద్యా బోధనపై టీచర్లకు శిక్షణ

కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి 120రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లందరికీ ప్రభుత్వం ఎన్నో పథకాలను అందిస్తోందని ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెదవేగి : అంగన్వాడీలు చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కుమార్ అన్నారు. శనివారం పెదవేగి జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు అంగన్‌వాడీల చేతుల్లోనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మోనటరింగ్ ఆఫీసర్ ఆర్ రామారావు, పీపీపీ నూరిబాబు, డీఆర్ లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

భీమడోలు : భీమడోలు హైస్కూల్‌లో రెండవ విడత జ్ఞానజ్యోతి కార్యక్రమం భీమడోలు జడ్పీ హైస్కూలులో ప్రారంభమైంది. 53 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని ప్రస్తుత సిలబస్ ప్రకారం మేధా అభివృద్ధి, భాషా అభివృద్ధిపై తర్ఫీదు పొందారు. కార్యక్రమంలో పీఆర్‌పీలు గోపాలకృష్ణ, కవిత, పీఆర్‌సీలు సత్య ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన పి.కన్నాపురం నాయకులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురంలో పలువురు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

వైసీపీ కార్యకర్తలు శనివారం టీడీపీలో చేరారు. దాదాపు 50 మంది కార్యకర్తలు పార్టీ మండలాధ్యక్షుడు లంకా సత్యన్నారాయణ నేతృత్వంలో టీడీపీలో చేరగా గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏపూరి దాలయ్య, నేతలు ఎన్.వెంకటేశ్వరరావు, కె.రమేష్, బాదిన పండు, శివ, బత్తిన శ్రీను, శ్యామ్, తుంగ శివ, అంబటి ఏడుకొండలు, సత్తిబాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

టి.నరసాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎం.జయబాబు విద్యార్థులకు సూచించారు. మండలంలోని టి.నరసాపురం, బొర్రంపాలెం జడ్పీ హైస్కూల్లోని విద్యార్థులకు సైబర్ నేరాలు, బాలికల వేధింపులు, ఆర్థిక మోసాలు, నకిలీ రుణయాప్‌లపై అభయ బృందం అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు ఎక్కువ అయ్యాయన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసంచేసి నగదు దోచుకుంటున్నారని అన్నారు. అభయ ద్వారా మహిళలకు, చిన్నారులకు ప్రభుత్వం రక్షణ చర్యలు చేపడుతోందని ఎవరైనా ఈవ్‌టీజింగ్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ గురించి తెలియజేశారు.



సంతోషినగర్ శర్వాణీ స్కూల్లో కవలలు



కామవరపు కోట మండలంలో కవలలు



కవలల దినోత్సవం

కామవరపుకోట/ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్ర జ్యోతి) : రావికం పాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఉమ్మడి భీమ రాజు ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ కవలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ పాఠశాలలో నాలుగు జంటలు కవల పిల్లలు వేర్వేరు తరగతుల్లో ఉన్నారని సభకు పరిచయం చేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ బేతిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచ కవలల దినోత్సవం మొదటి సారిగా పోలాండ్ దేశంలో 1976వ సంవత్సరం ఫిబ్రవరి 22న జరిగిందని, అప్పటి నుంచీ అదే రోజున ప్రపంచ కవలల దినోత్సవంలా నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రపంచ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు సంతోషినగర్ శర్వాణీ స్కూల్లో శనివారం విద్యార్థులు ఒకేరకమైన దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మదన మోహన రాజు పాల్గొన్నారు.



అప్పారావుకు చెక్కు అందజేస్తున్న దాతలు

మూడు లక్షల వితరణ

ఉంగుటూరు, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : కైకరం తూర్పు వీధిలో కొలువైన శ్రీసుందర సీతారామాలయంలోని అర్చక స్వామి వసతి వంటశాలకు భారీ విరాళం అందింది. సనపల ప్రకాశరావు, అమ్మన్న దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నీలాంబరరావు, నాగమణి, రామకృష్ణారావు, భానుమతి దంపతులు రూ.3 లక్షల చెక్కును నిర్వాహకులు కూన అప్పారావుకు అందించారు.



హనుమంతు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పోరాట యోధుడు కన్నెగంటికి నివాళి

కొయ్యలగూడెం, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరంలో అలుపెరగని పోరాటం చేసిన కన్నెగంటి హనుమంతు అని పలువురు నాయకులు కొనియాడారు. ఈ మేరకు శనివారం కొయ్యలగూడెంలో ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. నాయకులు చోడిపిండి సుబ్రహ్మణ్యం, మేకల అన్నవరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు మంతెన సోమరాజు, సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప అంజనేయరాజు, సంకు మధు, నక్కా బాబీ, నూకల రాము, ఏపూరి సతీష్, నివాస్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కారణం ఏమిటో తెలియదు కాని 70 ఏళ్ల వృద్ధురాలు పురుగు మందు తాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కలిదిండి మండలం పెద్దలంక గ్రామానికి చెందిన బి.మారెమ్మ ఈనెల 21న పురుగు మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆమెను ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా ఆసుపత్రి వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడిగూడెంలో కోడిపందేల స్థావరంపై ద్వారకాతిరుమల పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పందెం నిర్వాహకులను అరెస్ట్ చేసినట్టు ఎస్సై టి సుధీర్ తెలిపారు. అలాగే వారినుంచి వెయ్యి రూపాయల నగదు, పది బైక్‌లు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

ముగిసిన పాఠశాలల జోనల్ గేమ్స్

ఏలూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల జోనల్ గేమ్స్ శనివారంతో ముగిశాయి. శనివారం జరిగిన బాలుర ఈవెంట్‌లలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్ గేమ్స్ నిర్వహించారు. వాలీబాల్‌లో ఎస్ఆర్‌పాలెం టీం, కబడ్డీలో కెఆర్‌పురం టీం, త్రోబాల్, ఖోఖోలో రాజవరం టీంలు విజయం సాధించాయి. గెలుపొందిన వారికి హెచ్ఎం లోవ కుమారి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులు ఏలూరులో ఈ నెల 24, 25న జరిగే సెంట్రల్ జోన్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఇంటర్వ్యూ..

వినియోగదారుడి హక్కులను తెలుసుకోండి

హరిప్రసాద్, డిప్యూటీ కంట్రోలర్, తూనికలు కొలతల శాఖ, ఏలూరు



● వస్తువులు కొనేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు : వినియోగదారులు వస్తువులు కొనేటప్పుడు తూకంరాళ్లకు, కాటాలకు ప్రభుత్వ సీలు ఉందోలేదో చూసుకోవాలి. ప్యాకేజీలో ఉన్న వస్తువులు కొనేటప్పుడు ప్యాకేజీ పైన తయారీదారు చిరునామా, నికర బరువు, అమ్మకం ధర, గడువు తేదీలు సరి చూసుకోవాలి.

● పెట్రోలు, డీజిల్ మోసాలు ఎలా గుర్తించాలి?

జవాబు : మీటర్ రీడింగ్ సున్నాతో ప్రారంభమయ్యిందో లేదో చూసుకోవాలి. క్వాంటిటీ తక్కువ వచ్చిందని అనుమానం ఉంటే పెట్రోల్ బంకుల వద్ద ఉన్న ఐదు లీటర్ల డబ్బాతో కొలత వేసుకుని చూసుకోవచ్చు. పెట్రోల్, డీజిల్ కల్తీని బంకుల్లో ఉన్న ఫిల్టర్ పేపర్ మీద ఒక చుక్క ఆయిల్ వేస్తే రెండు నిమిషాల్లో ఎటువంటి మరక కనిపించదు.

● బంగారు ఆభరణాల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు : బంగారం తూకం వేసే ఎలక్ట్రానిక్ మిషన్ ఒక్క మిల్లిగ్రాము వరకు కచ్చితత్వం ఉండాలి. ఆ మిషన్‌కు లీగల్ మెట్రాలజీ ఉందోలేదో సరి చూసుకోవాలి. రసీదులో స్వచ్ఛత, ధర, బరువు కచ్చితంగా ఉందోలేదో చూసుకోవాలి.

ఏలూరు టూటౌన్,(ఆంధ్రజ్యోతి)

రావులపర్రులో జ్వరాలపై సర్వే

ఉంగుటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రావులపర్రు గ్రామంలో శనివారం జ్వరాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మానస అధ్యక్షతన డ్రైడే కార్యక్రమాల వివరాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కే.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు సత్యనారాయణ,గ్రామ ఆరోగ్య కార్యదర్శి శాంతి ప్రియ, అంగన్వాడీలు పార్వతి, శ్రీలక్ష్మి, గణపతి పాల్గొన్నారు.

120 మందికి నేత్ర పరీక్షలు

టి.నరసాపురం,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : 120 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించినట్టు జంగారెడ్డిగూడెం రామచంద్రా కంటి ఆసుపత్రి వైద్యులు డి.ఆదిత్య తెలిపారు. మండలంలోని మక్కినవారి గూడెం సొసైటీ ఆవరణలో మాజీ సొసైటీ అధ్యక్షులు ఆచంట సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆసుపత్రి వైద్య బృందం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య పరీక్షలు నిర్వహించి 40 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశామని, 35 మందికి ఆపరేషన్లు అవసరమని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఈవో యు. వి.వి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ

ఉంగుటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలంలోని రాచూరు గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభించి మూడు నెలలు పూర్తయింది. ఇందులో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శరణాల మాలతీరాణి, అడపా శోభారాణి, పెన్మత్స రామచంద్ర రాజులు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు సమరసత ఫౌండేషన్ ప్రతినిధి మెట్ట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

పెదవేగి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూచింపూడి గ్రామంలో డిసెంబర్ 8న ప్రారంభమైన గ్రామ దేవత గంగానమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. రెండు నెలలు జరుగుతున్న జాతరలో గ్రామస్థులు శనివారం గంగానమ్మకు వడపప్పు, పానకం నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రాత్రి గంగానమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు

ఏలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం నుంచి 27వ తేదీ మధ్యాహ్నం వరకు పట్టిసీమకు ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నామని ఆర్టీసీ డిఎం పివివి.గంగాధర రావు తెలిపారు. అలాగే తాడువాయి తిరునాళ్లకు కూడా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం తెలిపారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

కొయ్యలగూడెం, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికి తీయాలని సాయి రాకేష్ విద్యాసంస్థల చైర్ పర్సన్ సుభద్రాదేవి కోరారు. ఈ మేరకు మండలంలోని గవరవరం గ్రామంలో శనివారం సాయిరాకేష్ పాఠశాలలో సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో మేథాశక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. 300మంది విద్యార్థులు పైగా ఈ ప్రదర్శలో పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నరసింహరాజు, ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నూజివీడు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో 2025 -26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలకు తమ దరఖాస్తులను మార్చి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముదినేపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. స్కూల్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి వయస్సుకు తగిన ఎత్తు బరువును పరిశీలించారు. వైద్యశాఖ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ డి.ఉష పెయ్యేరులోని ఎంపీ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థుల రక్త నమూనాలు సేకరించారు. స్కూల్ హెచ్ఎం బేతాళ రాజేంద్ర ప్రసాద్, టీచర్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లి హైస్కూల్‌లో పిల్లల పుట్టిన రోజు వేడుకల నిర్వహణపై డెమో ప్రదర్శన

పుట్టిన రోజు చేసి చూపించారు..

ముదినేపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జ్ఞానజ్యోతి కోర్సుపై అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణలో శనివారం ముదినేపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఓ అంశానికి సంబంధించి ప్రాక్టికల్‌గా డెమో చేసి చూపించారు. ఐసీడీఎస్ కైకలూరు సీడీపీవో దీప్తి ఆధ్వర్యంలో నాల్గవ రోజు శిక్షణలో సూపర్‌వైజర్ సుందరమ్మ, రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరిస్తున్న టీచర్లు సివిఎల్.నరసింహారావు, ఎస్.చంద్రశేఖర్, కె.యశోద కృష్ణ, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పుట్టిన రోజు వేడుకలను నిర్వహించే విధానంపై కార్యకర్తలకు వివరిస్తుండగా, ఆ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థిని వినీత పుట్టిన రోజు అని తెలిసి ఆమె పుట్టిన రోజు వేడుకను నిర్వహిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యక్షంగా డెమో చేసి చూపించారు. పెదపాలపర్రు హైస్కూల్‌లో సూపర్‌వైజర్ ఝాన్సీ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పుట్టి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ, ఇతర అధికారులు

భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలపై సమీక్ష

కలిదిండి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రిని పురస్కరించుకుని అధికారులు సమన్వయంతో పనిచేసి కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. ఆలయం వద్ద శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులు పుణ్యస్నానమాచరించే కోనేరు వద్ద లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. తెప్పోత్సవం జరిగే ప్రదేశం పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ సరఫరా చేయాలన్నారు. కైకలూరు సీఐ రవికుమార్, కలిదిండి ఎస్ఐ వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఏఈ బి.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు


కైకలూరు : మహాశివరాత్రి మహోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. కైకలూరు మండలం ఆటపాకలో భద్రకాళీవీరభద్రసహిత సర్వమంగళపార్వతీ సమేత కనకలింగేశ్వరస్వామి మహాశివరాత్రి కల్యాణోత్సవాలను ఈనెల 24న ప్రారంభించనున్నారు. 24న స్వామిని పెండ్లికుమారుడిగా, అమ్మవారిని పెండ్లికుమార్తెగా చేయడం, 25న నిత్యాపాసిన, బలిహరణ, విశేష హోమాలు, వీరభద్రపళ్లెం ఆనకట్టి, ఊరేగింపు, 26న మహాశివరాత్రి సందర్భంగా సహస్రలింగార్చన, ఏకాదశ రుద్రాభిషేకాలు, స్వామి కల్యాణోత్సవం, లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకవార అభిషేకాలు, 27న అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బందా సత్యనారాయణ, ఈవో వీఎన్‌కే శేఖర్ తెలిపారు. కైకలూరు శ్యామలాంబ ఆలయంలో కొలువైయున్న పార్వతీసమేత రామలింగేశ్వర, రామేశ్వర, కనకలింగేశ్వరస్వామివార్లకు మహాశివరాత్రి సందర్భంగా అభిషేకాలు, 26న రాత్రి స్వామి కల్యాణోత్సవాలను నిర్వహించనున్నారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నట్టు ఈవో శేఖర్ తెలిపారు.

జలజీవన్ మిషన్ పనుల పూర్తికి గడువు పెంపు

మండవల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'కుళాయి లేని ప్రతీ ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే జలజీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశం. మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా వ్యక్తిగత కుళాయి పంపిణీ గడువు ముగిసింది. అయితే అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తయ్యేలా నెల రోజులు గడువు పెంచారు. లబ్ధిదారులను గుర్తించి త్వరితగతిన పనులు ప్రారంభించి కుళాయిలను పంపిణీ చేస్తాం. అందుకు గ్రామస్థులు సహకరించాల'ని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

స్థానిక సచివాలయంలో జలజీవన్ మిషన్ ఉచిత కుళాయిల పంపిణీ కార్యక్రమంపై శనివారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరందించేలా జలజీవన్ మిషన్ పథకానికి మండవల్లి ఎంపికైనట్టు తెలిపారు. మొగలాయి చెరువు వద్ద ఉన్న పథకానికి సుమారు రూ.69 లక్షలు, కొండరాయి చెరువు పథకానికి సుమారు రూ.15 లక్షలు ఖర్చు చేసి తాగునీరు అందించాల్సి ఉందన్నారు. 2022లో జలజీవన్ మిషన్‌కు ఎంపికైనప్పటికీ ఉచితంగా కుళాయిలు ఇవ్వకుండా ఎస్సీలకు రూ.7000, బీసీలకు రూ.10,000, ఓసీలకు రూ.15,000 చొప్పున వసూలు చేసేలా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ గ్రామసభ నిర్వహించారని పలువురు గ్రామస్థులు డీఈ దృష్టికి తీసుకువచ్చారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 8 నియోజక వర్గాలలో కాల్వలకు ఫిల్టర్‌బెడ్‌లకు సంబంధం లేకుండా శుద్ధి చేసిన నీటిని ప్రకాశం బ్యారేజీ నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకులకు ఎక్కించేలా పైపులైన్ ఏర్పాటు చేసేలా 700 కోట్లతో ప్రతిపాదనలు కేంద్రానికి పంపినట్టు తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండి, కైకలూరు, ముదినేపల్లి, మండవల్లి మండలాల్లో అందుకు సంబంధించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించేందుకు ఎంపిక చేశారన్నారు. మండవల్లి మండలంలో మండవల్లి, తక్కెళ్లపాడు, ఇంగిలిపాకలంక గ్రామాలను ఎంపిక చేశారన్నారు. అనంతరం పంటకాల్వ నుంచి తాగునీరు నేరుగా మొగలాయి చెరువులోనికి వెళ్లేలా ఏర్పాటు చేయాల్సిన కుండీ ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవార్డుల అందజేత



బహుమతులు అందజేస్తున్న జిల్లా పశుగణాభివృద్ధి అధికారులు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : వడ్లమానులో శనివారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ హరిత ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దూడల యాజమాన్య పద్ధతుల్లో ప్రతిభ కనబర్చిన రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు ప్రోత్సాహక బహుమతులు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా అందించారు. నూజివీడు పశుసంవర్ధక శాఖ పశు సంచాలకులు డాక్టర్ కె.చంద్రశేఖర్‌రావు, ఆగిరిపల్లి మండల పశువైద్యులు డాక్టర్ సిహెచ్ హనుమంతురావు, డాక్టర్ క్రాంతికిరణ్, డాక్టర్ శశివర్మ పాల్గొన్నారు.



ట్రోఫీతో విద్యార్థినులు

ఉత్సాహంగా బాలబాలికల ఆటల పోటీలు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సబ్ జోన్ బాలికల ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయని ప్రధానోపాధ్యాయిని పి.పుష్పలత తెలిపారు. శనివారం బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించామని తెలిపారు. వాలీబాల్ విన్నర్స్‌గా గుడిపాడు జడ్పీ హైస్కూల్, రన్నర్‌గా ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్, త్రోబాల్ విన్నర్స్ మర్లపాలెం జడ్పీ హైస్కూల్, రన్నర్స్ ముసునూరు జడ్పీ హైస్కూల్, ఖోఖో విన్నర్స్‌గా ఈదులగూడెం, రన్నర్స్ సూరవరం, కబడ్డీ విన్నర్స్ నూజివీడు బాలికోన్నత పాఠశాల, రన్నర్స్ త్రివిధ స్కూల్ నూజివీడు విజేతలుగా నిలిచారు. వీరందరికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శివనాగేంద్రరావు, సుగుణరావు, ఉమామహేశ్వరి, నాగరాజు, రవీంద్ర, నాగేశ్వరరావు, సతీష్, సుధాకర్, ప్రభాకర్, హర్ష, లక్ష్మి, వనజ, ఆలీఖాన్, రాజేంద్రప్రసాద్, సుకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటేసేందుకు రండి..

- పట్టభద్రుల ఓటర్ల వివరాల సేకరణ
- పోలింగ్‌కు రావాలని ఆహ్వానాలు
- 40 శాతంకు పైగా ఓటర్లు ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్టు గుర్తింపు

ముదినేపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు శాసనసభ ఎన్నికలను తలపిస్తున్నాయి. గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ఉద్యోగాల రీత్యా స్థిరపడిన స్థానిక ఓటర్లు స్వస్థలాల్లో ఓటు వేసేందుకు వచ్చిన మాదిరిగానే ప్రస్తుత పట్టభద్రులు శాసనమండలి ఎన్నికల్లోను ఓట్లు పోల్ చేయించేందుకు ఎన్‌డీఏ కూటమి నాయకులు సమాయత్తమవుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో 6,445 మంది పట్టభద్రులైన ఓటర్లు ఉండగా, వారు ఏయే ప్రాంతాల్లో ఉన్నదీ వివరాలు సేకరిస్తు న్నారు. వీరిలో 40 శాతం మంది పట్టభద్రులు రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాల్లో ఉద్యోగాలతోపాటు ఇతర రంగాల్లో స్థిరపడినట్టు తెలిసింది. హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, పుణేలో ఎక్కువ శాతం మంది సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నట్లు, విశాఖ, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో పలువురు డాక్టర్లు వైద్యవృత్తిలో స్థిరపడినట్టు గుర్తించారు. వారందరికీ ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి మండలాల్లో ఎమ్మెల్సీ ఓట్లు ఉన్నాయి. దీంతో ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు రావాలని సెల్‌ఫోన్ మెసేజ్‌లు పంపడమే కాక, గ్రామాల వారీగా నాయకులు స్వయంగా ఫోన్లు చేసి చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గంలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు అత్యధిక ఓట్ల మెజార్టీని సాధించాలన్న పట్టుదలతో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన పట్టభద్రుల ఓటర్లను రప్పించే బాధ్యతలను గ్రామాల వారీగా ఎన్‌డీఏ నాయకులకు అప్పగించారు. సమావేశాల్లోను ఆయన ఇదే అంశంపై సమీక్షిస్తున్నారు.



ముదినేపల్లి మండలం సూర్యనారాయణపురంలో కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని



కలిదిండి మండలం పెదపుట్లపూడిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

అభివృద్ధికే కూటమి ప్రభుత్వం అంకితం

ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికే అంకితమైందని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం బొమ్మినంపాడు శివారు సూర్యనారాయణపురంలో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు యర్రా రాంబాబు నివాసం వద్ద మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కామినేని మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించి కూటమి ప్రభుత్వానికి మద్దతునివ్వాలని కోరారు. ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు మెంటే పార్థసారథి, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు బొప్పన సుందర రామయ్య, యర్రా రాంబాబు, కోటప్రోలు కృష్ణారావు, సత్యవోలు నాగలక్ష్మి, వీరంకి వెంకటేశ్వరరావు, నల్లగోపు చలపతి, ఎఎస్.బాబు, బొంగు రవికుమార్, బాసినశెట్టి కిషోర్, వేల్పూరి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి : ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ పెదపుట్లపూడిలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి చక్రవర్తి, నాయకులు దున్న భోగేశ్వరరావు, దుగ్గిరాల పరమేశ్వరరావు, అక్కల వెంకటాచలం, గణపతి గోపాలరావు చాబత్తిన రాజు పాల్గొన్నారు.

చాట్రాయి : రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సూరంపాలెంలో టీడీపీ నాయకులు నక్కా రాము, కందుల కృష్ణ, చీదిరాల మారేశ్వరరావు, బొట్టు దుర్గారావు, శివయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నూజివీడు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కోరారు. నూజివీడులోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ చంద్రబాబు కు మద్దతుగా నిలిచేందుకు, రాష్ట్ర రాజధానిని ముందుకు తీసుకెళ్లేం దుకు పెద్దల సభకు ఆలపాటి లాంటి మేధావులను పంపాలని, నూజివీడు నియోజకవర్గ పరిధిలోని 9,650 మంది గ్రాడ్యు యేట్లు తమకే మద్దతు తెలపాలని కోరారు.

కైకలూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. కైకలూరులోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో పట్టభద్రు లను కలిసి ఓట్లను అభ్యర్థించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, కూటమి నాయకులు పోలవరపు లక్ష్మీరాణి, ఎండీ జానీ, ఎండీ ఉస్మాన్, గరికిపాటి రాంబాబు, పడమటి వాసు, తోట లక్ష్మీ, పుప్పాల సూర్యప్రకాశరావు, మంగినేని రామకృష్ణ, బొల్లా శ్యామలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : గోపవరంలో స్థానిక నాయకులతో కలిసి ఆలపాటి విజయం కోరుతూ టీడీపీ యువనేత ఉప్పలపాటి గణేష్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు కొప్పుల శ్రీనివాసరావు, జయరాజు, కుప్పాల శ్రీనివాసరావు, వంశీ, భూచక్రం పాల్గొన్నారు.




కైకలూరులో ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, కూటమి నేతలు



విద్యార్థినికి నగదు అందజేస్తున్న టీడీపీ నాయకుడు ఉదయ్ కిరణ్

పేద విద్యార్థులకు సాయం

ముసునూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చదువులో ప్రతిభ చూపుతున్న పేద విద్యార్థులకు ముసునూరుకు చెందిన నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్(బాబి) ఆర్థిక సాయం అందించారు. శనివారం నాలుగు మండలాల్లో 75 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున బాబి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా పలువురు బాబి దాతృత్వాన్ని కొనియాడారు. ఈ కార్యాక్రమంలో టీడీపీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారిణి అనురాధ

పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లిలో పారిశుద్యం పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారిణి అనూరాధ ఆదేశించారు. శనివారం ఆగిరిపల్లిలో ప్రత్యేక పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఇంటింటికి వెళ్ళి తడి, పొడి చెత్త సేకరించే విధానం పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని చెత్తనుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని పరిశీలించి అక్కడ పని చేస్తున్న సిబ్బందికి పలు సూచనలిచ్చారు. సగ్గూరు గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో సుందరి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఆనంద్ బాబు, పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180



నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

రీసర్వే తప్పులతో అవస్థలు

- సబ్ కలెక్టర్‌కు రైతుల మొర


చాట్రాయి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో వచ్చిన తప్పుల వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం గ్రామానికి చెందిన రైతులు శనివారం చాట్రాయి వచ్చిన నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణరాజ్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. స్థానిక నాయకులు మలగలపల్లి సుబ్రహ్మణ్యం, యర్రా రాజమోహనరావు ఆధ్వర్యంలో రైతులు సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతూ రీసర్వే వల్ల తమ గ్రామ పంచాయతీ పరిధిలో 1440 ఎకరాల భూములకు గాను 60 శాతం తప్పులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డుల్లో తేడాల వల్ల బ్యాంకులు సహకార సంఘాలు పంట రుణాలు ఇవ్వడం లేదని, భూముల క్రయ విక్రయాల సమయంలో సమస్యలు వస్తున్నాయని సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు.



చాట్రాయిలో సమస్యలు వివరిస్తున్న రైతులు

తప్పులు లేకుండా రీసర్వే చేయండి

మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా చిన్నంపేటలో చేస్తున్న భూముల రీసర్వే తప్పులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణరాజు అధికారులను ఆదేశించారు. చాట్రాయి ఎమ్మార్వో కార్యాలయంలో శనివారం చిన్నంపేట రీసర్వేపై సమీక్ష జరిపారు. సర్వే బృందం ప్రతి సర్వే నెంబరును సందర్శించి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సాగులో ఉన్న రైతులతో మాట్లాడి ఎటువంటి వివాదాలకు తావులేకుండా పక్కా రికార్డు రూపొందించాలని కోరారు. తహసీల్దార్ ప్రశాంతి, రెవెన్యూ సిబ్బందికి రీసర్వేపై సబ్ కలెక్టర్ సూచనలు చేశారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

క్రీడాపోటీల్లో యనమదల విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో యనమదల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని, పాఠశాల హెచ్ఎం ఎస్. నాగరాజు తెలిపారు. ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు త్రోబాల్లో ప్రథమస్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సర్పంచ్ వెంకటేశ్వర రావు, విద్యా కమిటీ చైర్మన్ పలగాని శ్రీనివాసరావు అభినందించారు.

మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలి

ముసునూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ వలసపల్లి గ్రామంలో శనివారం రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు నెరుసు శ్రీనివాసరావు, ఉప్పులూరి తిరుపతిరావు, గోళ్ళ సురేష్, రాజేష్ మాట్లాడుతూ ఈ ఏడాది మిర్చి పంటకు తెగుళ్లతో దిగుబడి తగ్గిందని, దీనికి తోడు మద్దతు ధర లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోయి, అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు తెగుళ్ల బెడద, మరోవైపు మద్దతు ధర లేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం మిరప పంటకు రూ.20 వేల మద్దతు ధర కల్పించాలని కోరారు.

భర్త మరణం తట్టుకోలేక.. ఎలుకల మందు తాగింది

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కలిదిండి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవిత చరమాంకంలో అన్నీ తానై చూసుకుంటున్న భర్త మరణాన్ని తట్టుకోలేక పోయింది. మానసికంగా స్థిమితం కోల్పోయింది. ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చివరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ లోకాన్ని విడిచింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. పెదలంక పంచాయతీ పరిధి పల్లిపాలెంకు చెందిన బొడ్డు మారెమ్మ (72) భర్త నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా వివాహాలై వెళ్లిపోవడంతో చాలాకాలం నుంచి మారెమ్మ దంపతులిద్దరే ఉంటున్నారు. ఈ క్రమంలో నాలుగు నెలల కిందట భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో మారెమ్మ తట్టుకోలేక పోయింది. అప్పటి నుంచి మానసిక కుంగిపోయి మతిస్థిమితం కోల్పోయింది. చివరకు ఈ నెల 18న ఎలుకల మందును నీటిలో కలుపుకుని తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కైకలూరు ప్రభుత్వాస్పత్రికి ఆపై ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రుక్మిణిదేవి, కావ్య

కానుకొల్లు విద్యార్థినుల ప్రతిభ

మండవల్లి ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్‌లో భాగంగా ముదినేపల్లిలో జరిగిన కైకలూరు నియోకవర్గ స్థాయి సబ్ జోన్ బాలికల పరుగు పోటీలో కానుకొల్లు విద్యార్థినులు ప్రతిభ చాటారు. 100 మీటర్ల పరుగు పోటీలో కానుకొల్లు జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎల్. రుక్మిణీదేవి బంగారు పతకం సాధించిందని హెచ్ఎం మాధవకుమార్ తెలిపారు. 600 మీటర్ల పరుగు పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని ఎస్.కావ్య ద్వితీయ స్థానం సాధించడంపై ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, సీహెచ్ఎస్ఎన్ మూర్తి అభినందించారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

చాట్రాయి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి మరింత ఎత్తుకు ఎదగాలని వికాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ నర్సిరెడ్డి ఉద్బోధించారు. చాట్రాయి వికాస్ కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల కారణంగా డిగ్రీ చదివినా ఉపాధి అవకాశాలు ఉంటాయని, ఇంజినీరింగ్ చదివితేనే మంచి ఉద్యోగం వస్తుందనేది కరెక్ట్ కాదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహనరెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

శ్మశానవాటికకు నీటి సదుపాయం

చాట్రాయి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలోని హిందూ స్మశానవాటికలో ఉన్న చేతి పంపు ఎంతో కాలం నుంచి పని చేయకపోవడంతో అంత్యక్రియలు, కర్మకాండలకు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను సర్పంచ్ దామెర ఉషా ప్రసాద్ బాబు దృష్టికి తీసుకెళ్లడంతో చేతి పంపుకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

సంపద సృష్టి కేంద్రాల పరిశీలన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టి కేంద్రాలను వాడుకలోకి తీసుకొచ్చి చెత్తనుంచి సంపద సృష్టించే దిశగా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారిణి అనూరాధ కోరారు. రావిచర్లలో సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించి తడి, పొడి చెత్త ద్వారా వర్మి కంపోస్ట్ తయారీ విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వృథాగా పారవేసే చెత్త నుంచి వ్యవసాయ భూములను సస్యశ్యామలం చేసేలా వర్మీ కంపోస్ట్‌ను తయారు చేసి రైతులకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.